
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

బుధవారం 24 సెప్టెంబరు 2025 | 5







ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో బీజేపీ ర్యాలీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పలు రకాల వస్తువులపై జీఎస్టీని తగ్గించడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అమలాపురంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లాశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు సెంటర్ వద్ద నుంచి ర్యాలీ చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించేలా, ఆర్థిక స్వావలంబన దిశగా జీఎస్టీని తగ్గించారన్నారు. ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ వేళ జీఎస్టీ తగ్గింపుపై ప్రకటన విడుదల చేసిన నెలల వ్యవధిలోనే తగ్గించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మోదీ, నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాలో పలుచోట్ల పాలాభిషేకాలు నిర్వహించామన్నారు. ఈ ర్యాలీలో పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పండుగ దోపిడీ!

- దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ స్పెషల్స్ నిల్
- దాంతో ప్రైవేటు ట్రావెల్స్ ఫుల్.. టిక్కెట్ ధరల దోపిడీ
- అధిక చార్జీల వసూళ్లతో ప్రయాణాలంటేనే జనం బెంబేలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

దసరా వచ్చిందయ్య.. సరదా తెచ్చిందయ్య.. దశమి వచ్చిందయ్యా..' దశనే మార్చిందయ్య.. అన్నట్టు ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు రేట్లు దారుణంగా పెంచేసి ప్రయాణికులను నిలువుదోపిడీ చేస్తున్నారు. పండుగ వస్తే చాలు ట్రావెల్స్ రేట్లు రికార్డులు బద్దలు కొడతాయి. జిల్లాకు చెందిన ప్రజలు అత్యధికంగా హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాల్లో నివాసం ఉండడంతోపాటు సాఫ్ట్‌వేర్ రంగంలో యువత ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. పండుగ వస్తే ఇంటికి వెళ్లాలనే వారి ఆశలను ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు అడియాశలు చేస్తున్నాయి. రేట్లు ఇష్టానుసారంగా పెంచేసి నిలువు దోపిడీ చేస్తున్నాయి. దీనికితోడు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులన్నీ వారికే కేటాయించడం వల్ల ప్రయాణికుల అవసరాలు తీర్చడానికి బస్సుల కొరత ఉంది. దాంతో దసరా పండుగకు ఎప్పుడూ ఆర్టీసీ సంస్థ హైదరాబాద్, విజయవాడ వంటి ప్రాంతాలకు ప్రత్యేక స్పెషల్ సర్వీసులు గతంలో నడిపేవారు. దీనికి రేట్లు కూడా ప్రత్యేకంగా ఉండేవి. అయితే ఇప్పుడు ఆర్టీసీ డిపోల్లో బస్సుల కొరత నేపథ్యంలో షెడ్యూల్డు సర్వీసులు మాత్రమే నడుపుతున్నారు. అయితే దసరాకు ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు టిక్కెట్ ధరలను అనూహ్యంగా పెంచేశాయి. నిత్యం 60కు పైనే సర్వీసులు యానాం నుంచి వయా అమలాపురం రావులపాలెం మీదుగా వివిధ సంస్థలకు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు నడుపుతున్నారు. దసరా కోసం ఇతర ప్రాంతాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్నా, ఇక్కడి వారు అక్కడికి వెళుతున్నా ప్రస్తుతం ఏసీ కోచ్‌ల్లో స్లీపర్ బెర్తులైతే రూ.2 వేల నుంచి రూ.3వేలు దాటి ధర పలుకుతోంది. ఆర్టీసీ సర్వీసులు లేకపోవడంతో పండుగకు రాకపోకలు సాగించే ప్రయాణికులంతా ట్రావెల్స్‌ను ఆశ్రయించడం వల్ల ధరలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. డిమాండ్‌ను బట్టి రూ.3వేలు దాటిపైనే టిక్కెట్ ధరలు వసూలు చేస్తున్నారు. సీట్లకైతే బస్సును బట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఆన్‌లైన్‌లో ధర పలుకుతోంది. దసరాకు సెలవులు కావడంతో పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా సొంత ఊర్లకు వచ్చే ప్రయాణికులు అధికంగా ఉండడం, దీనికి తగ్గట్టు ఆర్టీసీ స్పెషల్స్ లేకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ సంస్థల యాజమాన్యాలు పెట్టిందే రేటుగా ప్రయాణికుల నుంచి నిలువుదోపిడీ చేస్తున్నారు. పండుగలకు పెరుగుతున్న ట్రావెల్ రేట్లు చూసి టూరు వెళ్లాలనే ఆలోచనే మానుకుంటున్నారు. కొందరు ఎక్కువమంది ఉంటే కార్లు మాట్లాడుకుని వస్తుండగా, బైకుల మీద కూడా కొందరు తరలివస్తున్నారు. మొత్తానికి ప్రయాణికుల దసరా సరదా ఆశలపై నీళ్లు చల్లేలా ట్రావెలింగ్ రేట్లు పెరిగిపోయాయి.



అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు

ఆర్టీవో శ్రీనివాస్

దసరా పండగ సందర్భంగా ప్రయాణికుల బలహీనతను ఆసరాగా చేసుకుని ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో అధిక చార్జీలు వసూలుచేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా ఈ సమయంలో బస్ డ్రైవర్లు మితిమీరిన వేగంతో బస్సులు నడపవద్దు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దు. అలసగా ఉంటే పార్కింగ్ ప్రదేశంలో బస్సులు నిలిపి చల్లటి నీటితో ముఖం కడుక్కోవాలి. జిల్లాలో ఇప్పటివరకు 388 ప్రైవేటు బస్సులు తనిఖీచేసి రూ.33 లక్షలు అపరాధ రుసుముగా వసూలుచేశాం. నిరంతరం ఈ తనిఖీలు కొనసాగుతాయి. రహదారి భద్రత ఉల్లంఘనలు ఏవిధంగానూ ఉపేక్షించం.

సాగుకు.. సౌరభం!



వ్యవసాయానికి సోలార్ విద్యుత్

- రైతులకు తీరనున్న సమస్య
- పగలు 9 గంటలు సరఫరా
- రెండు జిల్లాల్లో ప్లాంట్ల ఏర్పాటు
- రూ.162 కోట్లతో 12 ప్రాజెక్టులు
- ఏడాదిలోపు పూర్తికి ఒప్పందం
- ఉత్పత్తయ్యే విద్యుత్ గ్రిడ్‌కు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సాగుకు సోలార్ విద్యుత్ రాబోతోంది. ఇకపై పగటిపూటే తొమ్మిది గంటలపాటు విద్యుత్‌ను అన్నదాతలు వినియోగించుకోవచ్చు. తద్వారా వ్యవసాయానికి విద్యుత్ బెంగ తీరబోతోంది. ఈ మేరకు ట్రాన్స్‌కో రూ.162 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించడానికి అడుగులు వేసింది. దీని ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కేవలం పగటి పూట రైతులు వాడుకునేందుకు మాత్రమే సరఫరా చేయనుంది. తద్వారా రైతులు విద్యుత్ కోసం రాత్రి వేళల్లో పడిగాపులు కాసే పరిస్థితులు తప్పనున్నాయి. కాకినాడ జిల్లాలో పోలవరం కాలువ వెంబడి మురారీ నుంచి తేటగుంట వరకు 11 చోట్ల, రాజమహేంద్రవరం జేగురుపాడులో 30 ఎకరాల్లో మరోచోట ఈ భారీ సోలార్ పవర్ ప్లాంట్లు రాబోతున్నాయి. పీఎం కుసుమ్ కింద వీటి నిర్మాణ పనులను తాజాగా పేరాడిమ్ టెక్నాలజీ, నోవల్ లాజిటెక్ సంస్థలు దక్కించుకున్నాయి. ఏడాదిలోగా ప్లాంట్ల నిర్మాణం పూర్తి చేయనున్నాయి. కాకినాడ జిల్లాలో 11 ప్రాజెక్టులకు రూ.150 కోట్లు, జేగురుపాడు సోలార్ ప్లాంట్‌కు రూ.12 కోట్లు ఖర్చుకానుంది. సోలార్ పవర్ ప్లాంట్లను దక్కించుకున్న సంస్థలు ఇటీవల స్థల పరిశీలన పూర్తి చేశాయి.

ఇక బెంగ తీరినట్లే...

వ్యవసాయాధారిత జిల్లా ఉమ్మడి తూర్పుగోదావరి. వరి, వాణిజ్య పంటల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే మంచి ప్రగతి సాధిస్తున్నారు. అయితే వీరిలో విద్యుత్ మోటార్లపై ఆధారపడి సాగు చేస్తోన్న వారి సంఖ్య అధికమే. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 70 వేల వరకు ఉన్నాయి. వీటిలో సాగుకు పక్కాగా తరచూ విద్యుత్ వినియోగిస్తోన్న కనెక్షన్లు 51 వేలు ఉన్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తోంది. 49 వేల మంది రైతులు వినియోగించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు 3.10 లక్షల కిలోవాట్స్ లోడ్ అవసరం అవుతోంది. అంటే 500 మిలియన్ యూనిట్లపైనే. ఈ మొత్తం విద్యుత్‌ను అన్నదాతలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందుకు ఏటా రూ.300 కోట్ల వరకు ఆర్థిక భారం పడుతోంది. లోడ్ అంతరాయాలు లేకుండా ఇప్పటికే మూడు ఈహెచ్‌టీ విద్యుత్ ఉప కేంద్రాల్లో రూ.148 కోట్లతో 33 కేవీ ఫీడర్లు ఏర్పాటు చేశారు. ఇందులో రూ.38.41 కోట్లతో 25 పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంచారు. మరో 19 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేశారు. ఇంత చేసినా తీవ్ర వేసవి సమయంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం కష్టం అవుతోంది. దీంతో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కోతలు విధించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. దీంతో అత్యవసర సమయంలో నీరందరక పంటలు ఎండి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇకపై సాగుకు విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకూడదనే లక్ష్యంలో భాగంగా పీఎం కుసుమ్ ప్రాజెక్టు కింద ట్రాన్స్‌కో అధికారులు సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించారు.

సోలార్ ప్లాంట్లు ఏర్పాటు

పీఎం కుసుం పథకం కింద పగటి పూట తొమ్మిది గంటలు సోలార్ విద్యుత్ సరఫరా చేయడానికి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 12 చోట్ల సోలార్ పవర్‌ప్లాంట్లను నిర్మించాలని నిర్ణయించారు. వీటి నిర్మాణం పూర్తయ్యాక ఉత్పత్తయ్యే విద్యుత్‌కు గ్రిడ్‌ను అనుసంధానించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కు మాత్రమే సరఫరా చేయనున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో రూ.150 కోట్లతో 11 చోట్ల వీటిని నిర్మించనున్నారు. స్థల సమస్య ఉండడంతో పోలవరం కాలువ వెంబడి నిర్మిస్తున్నారు. జగ్గంపేట నియోజవర్గం గండేపల్లి మండలం మురారీ నుంచి తుని నియోజకవర్గం తేటగుంట వరకు కాలువ వెంబడి సోలార్ పవర్ ప్లాంట్లు రానున్నాయి. గండేపల్లి మండలం బొర్రంపాలెంలో 16 ఎకరాల్లో, ఉప్పలపాడులో 11, గండేపల్లిలో 23, మురారి 8, నాయంకపల్లి 10.40 ఎకరాలు, జగ్గంపేటలో 25.73, ప్రత్తిపాడులో 16, అన్నవరం 17.36, కత్తిపూడి 11.49, తుని రూరల్ తేటగుంటలో 1.79, తుని చామరవరంలో 24.07 ఎకరాల్లో మొత్తం 173.65 ఎకరాల్లో సోలార్ పవర్‌ప్లాంట్లు రాబోతున్నాయి. మొత్తం కాలువ వెంబడి స్థలాల్లో ఐదు నుంచి పదెకరాల వరకు ఉన్న చోట్ల 8 మెగావాట్ల వరకు, తక్కువ స్థలం ఉన్నచోట్ల రెండు నుంచి నాలుగు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ప్లాంట్లను స్థాపించనున్నారు. మొత్తం అన్నీ కలిపి 173.65 ఎకరాల్లో 40 మెగావాట్ల సామర్థ్యంతో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఇవి రాబోతున్నాయి.

కోనసీమలో మాత్రం..

వీటికి ఇటీవల టెండర్లు పిలిచారు. కాకినాడ జిల్లాలో ప్లాంట్ల నిర్మాణ పనులను పేరాడిమ్ టెక్నాలజీ సంస్థ దక్కించుకోగా, తాజాగా కంపెనీ ప్రతినిధులు అన్ని స్థలాలను పరిశీలించి వెళ్లారు. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజ మహేంద్రవరం సమీపంలోని జేగురుపాడులో 30 ఎకరాలు గుర్తించారు. ఇక్కడ 9.5 మెగా వాట్ల సామర్థ్యంతో సోలార్ పవర్ ప్లాంట్ నిర్మించనున్నారు. ఈ పనులను నోవల్‌లాజిటెక్ సంస్థ దక్కించుకుంది. ఇందుకు రూ.12 కోట్ల వరకు ఖర్చు కానుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండుచోట్ల సోలార్ ప్లాంట్లను నిర్మించడానికి ప్రయత్నించినా స్థల సమస్యతోపాటు ఎక్కడికక్కడ చెట్లు అడ్డు తగులుతుండడంతో సోలార్ విద్యుత్‌కు సరిపడా ఎండ లభించదనే నిర్ణయానికి ప్రస్తుతం వచ్చారు.

జిల్లాలో 29 సారా రహిత గ్రామాలుగా ప్రకటన

ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష

పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ మీనా



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ మీనా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేణుక తదితరులు

అమలాపురం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): నవోదయ ద్వారా జిల్లాలోని ఎనిమిది మండలాల పరిధిలో 29 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించడం జరిగిందని కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం అమలాపురంలోని కలెక్టరేట్‌లో నవోదయం 2.0 కార్యక్రమాల అమలుపై జిల్లా పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమాలను పటిష్ఠంగా అమలుచేసి సారా రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాటుసారాకు బానిసలైన వారికి పునరావాసం కల్పించి సారా అమ్మకమే వృత్తిగా జీవించేవారికి ప్రత్యామ్నాయ జీవనోపాదులు కల్పించడం జరుగుతోందన్నారు. పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూశాఖలు సమష్టిగా సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తొలుత ప్రొహిబిషన్ అండ్‌ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేణుక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నవోదయ అమలు తీరును వివరించారు. ఆలమూరు, పి.గన్నవరం, ఆత్రేయపురం మండలాల్లో 29 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాహుల్ మీనా, డీఆర్వో కె.మాధవి, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, డీఆర్డీఏ పీడీ గాంధీ, అటవీశాఖ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

అసంపూర్తి ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం పూర్తిచేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలను సత్వరం పూర్తిచేసి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని కోరుతూ ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మిబాబు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వినతిపత్రాలు అందజేశారు. జలజీవన్‌మిషన్ పథకం ద్వారా మండలంలో మంచినీటి ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇప్పటికే 75శాతం పనులు పూర్తికాగా, మరికొన్ని 50 శాతం పూర్తయినా పనులు నిలిచిపోయాయని కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే ఆక్వా చెరువులు, ఓఎన్జీసీ కార్యకలాపాలతో తాగునీరు కలుషితమైందని, ప్రజలకు సురక్షిత మంచినీరు అందించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణాలు వెంటనే పూర్తిచేయాలని కోరారు. ఈ నిర్మాణాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఎంపీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దాసరి అరుణ, నక్కా అరుణకుమారి, పరమట శ్యామ్‌కుమార్, కరాటం ప్రవీణ్, అంకం హిమభారతి, రేలంగి దుర్గారావు, నాని, రేవు శ్రీను, గుత్తుల ఏసుబాబు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్ల ఆధునికీకరణకు నిధులు ఇవ్వండి

అసెంబ్లీలో కోరిన ప్రభుత్వ విప్ దాట్ల



ముమ్మిడివరం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్ల ఆధునికీకరణకు తక్షణం నిధులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అసెంబ్లీ సమావేశంలో బుధవారం జీరో అవర్‌లో సుబ్బరాజు మాట్లాడారు. ఎన్డీబీ ఫేజ్-1 కింద, ముమ్మిడివరం-కాట్రేనికోన ఆర్అండ్‌బీ రోడ్డు అయినాపురం మీదుగా రూ.23.61 లక్షలు, మురమళ్ల-ఎదుర్లంక ఆర్అండ్‌బీ రోడ్డు (ఐ.పోలవరం) రూ.కోటి 25 లక్షలు, కాకినాడ-యానం నేషనల్ హైవే నుంచి కాకినాడ-ద్రాక్షారామ స్టేట్ హైవే (జి.వేమవరం నుంచి గొర్రెపూడి)రోడ్డు రూ.10 కోట్ల 44 లక్షలు 2022లో మంజూరై సుధాకర్ ఇన్‌ఫ్రా సంస్థకు టెండర్లు ఖరారు చేసిందని, అయితే వారు పనులు ప్రారంభించకపోవడంతో కూటమి ప్రభుత్వం గత ఫిబ్రవరి నెలలో రద్దు చేసిందన్నారు. ఈ రోడ్లు ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో పలు గ్రామాలకు అనుసంధానం కల్పించే కీలకమైన రహదారులు అన్నారు. గత మూడేళ్లుగా ఒప్పందాలు ముగిసినా పనులు ప్రారంభించకపోవడం వల్ల ఈ రహదారులు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయని, అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయని, ఈ రహదారుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, గత ప్రభుత్వ హయాంలో పార్టీ తరఫున వినతులు, ఆందోళనలు చేపట్టడం జరిగిందని, ఈ విషయం ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు కూడా విదితమేనన్నారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు రహదారుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించారని, ప్రస్తుతం ఈ రోడ్లపై వాహనాల రాకపోకలు అధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజలకు రవాణా సౌకర్యం, రక్షణ, ప్రాంతీయ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు పనులకు తక్షణం నిధులు మంజూరు చేయాలని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరావుకు ఎమ్మెల్యే సుబ్బరాజు విజ్ఞప్తి చేశారు.

బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జిలను పునర్నిర్మించాలి



కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గంలో బ్రిటిష్ హయాంలో నిర్మించిన వంతెనలు దాదాపు శిథిలావస్థకు చేరినందున వాటిని పునర్నిర్మించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించి ప్రభుత్వానికి విన్నవించారు. కొత్తపేట, గోగివారిపేట, బోడిపాలెం, ర్యాలి, ఊతకోట తదితర ప్రాంతాల్లోని పురాతన వంతెనలు దాదాపు పూర్తిగా శిథిలావస్థకు చేరి కుంగిపోయాయని అప్పట్లో ఐరన్ గడ్డర్లతో నిర్మించిన బ్రిడ్జిలు కావడం వల్ల ఇప్పటివరకూ నెట్టుకొచ్చాయని వివరించారు. వాటిపై నిరంతరం ఓఎన్జీసీ తదితర భారీ వాహనాలు తిరుగుతుండడం వల్ల అవి ఎప్పుడు కూలిపోతాయోనన్న పరిస్థితికి చేరాయని వివరించారు. తక్షణం వాటి పునర్నిర్మాణానికి సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కోనసీమ జిల్లాలో పూర్తిగా వ్యవసాయం జీవనాధరంగా పనిచేస్తున్నారని, కొద్దిపాటి టూరిజం తప్ప ఎటువంటి ఉద్యోగ అవకాశాలు ఇక్కడ లేవన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూసేకరణ పెద్ద తలనొప్పిగా తయారైందని, ప్రభుత్వం చొరవ చూపి ఈ పార్కుల ఏర్పాటు ద్వారా కొబ్బరి, అరటి తదితర ఉప ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే అనేక మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం దీన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.



శంకరగుప్తంలో కొబ్బరిచెట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం.. (పైన) మోడువారిన చెట్లు

సముద్ర పోటుతో కొబ్బరిచెట్ల వినాశనం

శంకరగుప్తం కొబ్బరితోటల్లో అంబాజీపేట శాస్త్రవేత్తల బృందం పర్యటన

అంబాజీపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దివి ప్రాంతంలో ఉన్న కేశనపల్లి, తూర్పుపాలెం తదితర ప్రాంతాల్లో సముద్రపునీరు పోటు వల్ల కొబ్బరిచెట్లు అధికంగా చనిపోతున్నాయని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎం.ముత్యాలనాయుడు చెప్పారు. ఉద్యానపరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారుల బృందం ఆ ప్రాంతాలను మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ముత్యాలనాయుడు మాట్లాడుతూ జిల్లాలోని శంకరగుప్తం కాలువ వెంబడి ఉన్న పెద్ద ప్రాంతమన్నారు. ఆ ప్రాంతంలో కొబ్బరి చెట్లు 40 సంవత్సరాలపైబడి ఉన్నాయన్నారు. 2017 నుంచి ఆ ప్రాంతంలో కాలువ ద్వారా సముద్రపు ఉప్పునీరు వెనక్కి రావడంతో కొబ్బరి చెట్లు ఎక్కువగా మరణిస్తున్నాయన్నారు. ఈ కాలువద్వారా నీరు మళ్లేందుకు 9 కిలోమీటర్ల మేర మాత్రమే తవ్వకాన్ని చేపట్టారన్నారు. ప్రభావిత ప్రాంతం తీరానికి శంకరగుప్తం దగ్గరగా ఉండడంతో ఆటుపోట్ల సమయంలో సముద్రపు నీరు అక్కడ ఉన్న కాలువలోకి ప్రవేశించి అనంతరం పక్కనే ఉన్న కొబ్బరి తోట్లలోకి పొంగి ప్రవహిస్తోందన్నారు. 2017 నుంచి నేల, భూగర్భ జలాల లవణీయత పెరిగిందని, ఇది పంట ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తోందన్నారు. ఈ విషయంలో నేల, ప్రభావిత పొలాల మట్టినమూనాలను సేకరించడం జరిగిందన్నారు. పీహెచ్, విద్యుత్ వాహకత, ఇతర కీలకమైన భౌతిక రసాయన పరిమితులను అధ్యయనం చేశారన్నారు. శంకరగుప్తం డ్రైనేజీ కాలువ తవ్వకాల ఆపరేషన్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, ఈ సమస్యను అధిగమించేందుకు చేలల్లో జీలుగ, పచ్చిరొట్ట ఎరువు పంటనువేసి కలియదున్నడం, జిప్సం వేయడం వంటివి సిఫార్సు చేయాలని ఉద్యాన శాఖాధికారులకు సూచించారు. శాస్త్రవేత్తలు డి.వెంకటస్వామి, పెదబాబు, గోవర్ధనరావు, ఉద్యాన వన అధికారి శైలజ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రేపు బెజవాడకు డీఎస్సీ అభ్యర్థులు

రాజమహేంద్రవరం,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ- 2025లో టీచర్లుగా విజయం సాధించిన 3,315 మంది ఉపాధ్యాయ అభ్యర్థులను ఈ నెల 25న విజయవాడలో జరిగే సభకు తీసుకెళ్లడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి 72 బస్సులను సిద్ధం చేస్తున్నారు. వీరంతా బుధవారం సాయంత్రానికి రాజమహేంద్రవరం చేరుకుని పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. అక్కడ నుంచి గురువారం బయలుదేరి విజయవాడ వెళ్లేలా వసతి, ప్రయాణ ఏర్పాట్లు చేశారు. విజయవాడలో జరిగే ఈ సభలో సీఎం చంద్రబాబు పాల్గొని వీరికి నియామక పత్రాలను అందజేస్తారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం మోరంపూడి కూడలిలోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన హోర్డింగ్

జర భద్రం

ట్రాఫిక్ రూల్స్ పాటించు.. జాగ్రత్తగా ఇంటికి వెళ్తావు

జాతీయ రహదారులపై ఆలోచింప చేస్తున్న సందేశాత్మక హోర్డింగులు

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

జర భద్రం... రహదారులపై ప్రయాణించే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ జాతీయ రహదారుల వెంబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పోలీసు శాఖ ఏర్పాటుచేసిన సందేశాత్మక హోర్డింగులు అందరినీ ఆలోచింపచేస్తున్నాయి.

కాకినాడ జిల్లా కత్తిపూడి నుంచి తిమ్మాపురం వరకు గత 216 జాతీయ రహదారి, తుని నుంచి రావులపాలెం, దివాన్‌చెరువు వరకు గల జాతీయ రహదారి వెంబడి పలు ముఖ్యమైన కూడళ్లు, ప్రాంతాల్లో హోర్డింగులు పెట్టారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వీటిని ఏర్పాటు చేయడంతో పాటు వాహనచోదకులకు జాగ్రత్తలు సూచించారు. ప్రతి హోర్డింగుపై 'బాగుంటావ్, ట్రాఫిక్ రూల్స్ పాటించు జాగ్రత్తగా ఇంటికి వెళ్తావు' అని ఉంది. అదే సమయంలో ఒక్కో బోర్డుపై ఒక్కో సందేశాన్ని ఇచ్చారు.

హెల్మెట్ పెట్టుకో బాగుంటావ్ అంటూ హెల్మెట్ ధరించిన వ్యక్తి ఫొటో, ప్రమాదానికి గురైన వ్యక్తి ఫొటోను ఒక హోర్డింగులో ప్రదర్శించారు.

డ్రైవింగ్ చేస్తూ ఫోను మాట్లాడకు... బాగుంటావ్ అంటూ తూర్పు గోదావరి జిల్లాలో జాతీయ రహదారిపై డ్రైవ్ చేస్తున్న వ్యక్తి ఫోను మాట్లాడుతూ జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి నిలువునా నిలుచున్న కారు ఫొటోను మరో హోర్డింగ్‌లో ప్రదర్శించారు. ఇతర ప్రాంతాల్లో ఇటువంటి వాటినే ఏర్పాటు చేశారు. ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పెట్టిన ఈ హోర్డింగులు వాహన చోదకులను ఆకట్టుకుంటున్నాయి.



కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్ కూడలి వద్ద ఏర్పాటుచేసిన హెల్మెట్ పెట్టుకో బాగుంటావ్ హోర్డింగ్

జేఎన్టీయూకేలో 'స్మార్ట్ ఇండియా హ్యాకథాన్'

జేఎన్టీయూకే, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని యూసీఈకేలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025 అంతర్గత మూల్యాంకన మంగళవారం జరిగింది. దీనిని ప్రిన్సిపాల్ మోహన్‌రావు ప్రారంభించగా కరుణ సమన్వయకర్తగా వ్యవహరించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ అనేది దేశవ్యాప్తంగా విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించే కార్యక్రమమని ప్రిన్సిపాల్ తెలిపారు. బెంగళూరుకు చెందిన క్రిఫీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఎండీ కె.కృష్ణారెడ్డి, సీఎస్ఈ ప్రొఫెసర్ ఎల్.సుమలత, మెకానికల్ ఇంజనీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కిషోర్ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.మొత్తం 34 బృందాలు హాజరుకాగా ఎంపికైన బృందాలు జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో యూసీఈకే తరపున పాల్గొంటాయని ప్రిన్సిపాల్ చెప్పారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎస్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపికలు



వలంటీర్ల ఎంపిక నిర్వహిస్తున్న దృశ్యం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ పరేడ్ క్యాంప్‌లో పాల్గొనే ఉత్తమ ఎస్ఎస్ఎస్ వలంటీర్లను ఎంపిక చేసేందుకు కాకినాడ జేఎన్టీయూ ఇండోర్ మైదానంలో మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు.ఎంపికలను హైదరాబాద్ ప్రాంతీయ డైరెక్టరేట్, ఎస్ఎస్ఎస్ సెల్, వర్సిటీ నిర్వహించాయి. ప్రాంతీయ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ సమైక్యతకు ప్రతీకలన్నారు. సమన్వయకర్త జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ రిపబ్లిక్ డే పరేడ్‌లో చోటుదక్కడం ప్రతి విద్యార్థికీ గొప్ప గౌరవమన్నారు.ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైన వలంటీర్లు ఢిల్లీలో జరిగే పరేడ్‌లో జేఎన్టీయూకే తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ప్రాంతీయ డైరెక్టరేట్ ప్రతినిధి సం జయ్, ఎస్ఎస్ఎస్ అధికారులు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు.

జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీలో కుర్రాళ్ల ప్రతిభ



రన్నర్స్‌గా నిలిచిన ఆంధ్ర క్రీడాకారులు

సామర్లకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రం పంచకులాలో ఈ నెల 13 నుంచి 22 వరకు జరిగిన యొనెక్స్ సన్‌రైజ్ అశ్వినిగుప్తా మెమోరియల్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డబుల్స్ విభాగంలో కాకినాడ జిల్లా సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ, చిత్తూరు జిల్లాకు చెందిన తిప్పన చరణ్‌రామ్ సత్తా చాటారు. చైనాలో వచ్చే నెలలో జరిగే ఆసియన్ గేమ్స్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. మంగళవారం సాయంత్రం స్వగ్రామానికి చేరుకున్న హరికృష్ణకు సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు, వీరం రెడ్డి పెదబాబు, సలాది బ్రహ్మానందరావు(రమేష్), వీరం రెడ్డి నాని పూలమాలలు వేసి సత్కరించారు.

అంతర్జాతీయ నాటక ప్రదర్శనకు 'శ్రీప్రకాష్' విద్యార్థులు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సురేష్‌నగర్‌లోని శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల విద్యార్థులు టెమిర్బెక్ జుర్గెనోవ్ కజక్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అల్మాటీ, కజకిస్థాన్, జాని బెన్కోవ్ యూనివర్సిటీ, షిమ్‌కెంట్లో, ఉజ్బెకిస్థాన్ వర్సిటీల్లో నాటక ప్రదర్శనలు ఇవ్వనున్నారని డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. నటుడు, దర్శకుడు, విద్యావేత్త, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పూర్వ విద్యార్థి కుమార్ సుమిత్ రూపకల్పన, దర్శకత్వంలో శిక్షణ పొందిన తమ విద్యార్థులు ఎల్లలు దాటి ప్రతిభ చాటనున్నారన్నారు. కింగ్ లియర్, జూలియస్ సీజర్ వంటి క్లాసికల్ షేక్స్పియర్ నాటకాలను ప్రదర్శించేందుకు పయనమై ఆ దేశాలకు వెళ్లారు. అక్టోబరు 1వరకు పలు వర్సిటీలలో పలు ప్రదర్శనలు ఇస్తారని చెప్పారు.

కాకినాడ జీజీహెచ్‌లో 2డి ఎకో సేవలు పునః ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో 2డి ఎకో సేవలు మంగళవారం పునః ప్రారంభమైనట్టు ఎన్టీఆర్ వైద్య సేవ డాక్టర్ వి.వరప్రసాద్ తెలిపారు. ఇన్ సోర్సింగ్ పరిధిలో బయటి నుంచి జీజీహెచ్‌కు హృద్రోగ వైద్య నిపుణులను తీసుకొచ్చి 2డి ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ఇన్ సోర్సింగ్‌కు అనుమతి ఇవ్వడంతో 2డీ ఎకో సేవలకు మార్గం సుగమమైంది. మంగళవారం ఒక్కరోజే సుమారు 30కి పైగా పరీక్షలు చేసినట్టు డాక్టర్ వరప్రసాద్ చెప్పారు.

బొమ్మల కొలువు....

విశ్వేశ్వరీదేవి సన్నిధిలో ఆకట్టుకునేట్టు...

దివాన్‌చెరువు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేటి యాంత్రిక జీవనంలో సైతం సంప్రదాయాలను పాటిస్తూ శరన్నవరాత్రి వేళ విశ్వేశ్వరీదేవి ఆలయంలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. భక్తి ప్రధానంగానే కాకుండా కళాత్మక దృష్టిని కనబరుస్తూ డాక్టర్ రాంబాబు సతీమణి సుబ్బలక్ష్మి కొలువుదీర్చిన బొమ్మలు ఆకర్షిస్తున్నాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఒకపక్కన మెట్లు, మెట్లుగా ఏర్పాటుచేసి దానిపై తెల్లటి వస్త్రాన్ని ఉంచారు. గణపతి, బాలకుమారస్వామిమధ్య పసుపు కొమ్ములను గుట్టలుగా పోసి దానిపై విశ్వేశ్వరీదేవి బొమ్మను ఉంచారు. ఒకవైపున మహాలక్ష్మి, సీత, రుక్మిణి, రాధ, లలిత, సరస్వతి, శారదాంబ, రెండోవైపున కామాక్షి, విశాలాక్షి, అన్నపూర్ణ, గాయత్రి, అర్ధనారీశ్వరుడు, బాలాత్రిపురసుందరీదేవి, మహాకాళి, కనకదుర్గ, శైలపుత్రి బొమ్మలను అందంగా అలంకరించారు. అందులో నెమలి పింఛాలను కూడా ఉంచారు. మరి ఈ బొమ్మల కొలువును మనమూ ఓసారి చూసొద్దాం.


దివాన్‌చెరువులోని శ్రీవిశ్వేశ్వరీదేవి ఆలయంలో బొమ్మలకొలువు




కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి

వైభవంగా మహా శక్తి యాగం

కాకినాడ శ్రీపీఠంలో రెండో రోజు 22 కోట్లకు చేరుకున్న లలితా సహస్రనామ కుంకుమార్చనలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేటలోని శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో మొదలైన మహాశక్తి యాగం మంగళవారం రెండో రోజుకి చేరుకుంది. శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారికి అర్గళా స్తోత్ర హోమం, సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం నిర్వహించారు. స్వామి పరిపూర్ణానంద భక్తులకు అనుగ్రహభాషణ చేస్తూ... సకల సృష్టికి మొట్టమొదట తల్లిదండ్రులు సూర్య చంద్రులని, వారి అనుగ్రహం లేకపోతే ఆహారం పండదన్నారు. రెండో తల్లిదండ్రులైన గోమాత, వృషభం లేకపోతే ఎరువు, భూమి దున్నకపోతే పంట పండదన్నారు. మూడో తల్లిదండ్రులు రైతు అని, ఇతను పండించకపోతే ఆహారం ఉండదన్నారు. నాలుగో తల్లిదండ్రులు అమ్మ అని, ఆమె ఆహారం వండిపెట్టకపోతే మనుగడ ఉండన్నారు. మనం కేవలం కళ్లతో చూస్తే పొందే ఆనందాన్ని చక్షురానందం, ఇంద్రియ ఆనందం అంటామన్నారు. అమ్మ నామం, పారాయణ చేసి పూజిస్తే ఇంద్రియానందం పొంది అనుగ్రహానికి పాత్రులు కావచ్చన్నారు. వేలాది మంది మాతృమూర్తుల సంకల్పం, పట్టుదలతో రెండో రోజు 22కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలు పూర్తయ్యాయన్నారు. అష్టమి తిథి ప్రభావం తీవ్రంగా ఉంటుందని, దానిని తగ్గించి అందరికీ మంచికోసం అమ్మవారిని గట్టిగా ఆరాధన చేసేందుకు వీలుగా బగళాముఖి హోమం, వారాహి అమ్మవారికి ప్రత్యంగిరా హోమం, చండీ హోమంలను ప్రత్యేకంగా జరపనున్నట్టు తెలిపారు. ఈ నెల 29న సుమారు 24 వేల మంది విద్యార్థులతో త్రికోటి మహా సరస్వతి పూజ నిర్వహిస్తామన్నారు. ప్రముఖ కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మహాశక్తి యాగంపై 'లలిత' పేరుతో సినిమా తీయబోతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. లలితాసహస్రనామంపై రాసిన పాటను బుధవారం మహాశక్తి యాగం వేదికపై జొన్నవిత్తుల సమక్షంలో ఆవిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లను సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ రామారావు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.




గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని హారతి తీసుకుంటున్న భక్తులు


దేవీచౌక్‌లో గాయత్రీ దేవిగా...

అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్న భక్తులు... ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో దేవీచౌక్‌లో శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. నగర ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రముఖులు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని అనుగ్రహం పొందారు. దేవీచౌక్ సెంటరు మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలతో వెలుగొందుతోంది. దేవాలయాల గోపురాల సెట్టింగులు, దేవతామూర్తుల లైటింగ్ బోర్డులు ఆకట్టుకుంటున్నాయి. దసరా సెలవుల కారణంగా సాయంత్రం పూట ఉత్సవాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. రోడ్డుకిరువైపులా బొమ్మలు, చిరుతిళ్ల దుకాణాలు తిరునాళ్లను తలపిస్తోంది. రాత్రి నాట్య ప్రదర్శనలు, నాటకాలు, సినీ సంగీత విభావరులు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి వీటిని అధిక సంఖ్యలో యువత, ప్రజలు తిలకించారు.



మంగళవారం రాత్రి ఆకట్టుకున్న కాళికా నృత్య ప్రదర్శన, భక్తులతో కిక్కిరిసిన దేవీచౌక్



గాజుల దుర్గమ్మ

దేవీ శరనవరాత్రుల్లో భాగంగా కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరిలో బాలకనకదుర్గ మంగళవారం గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

ఆంధ్రా క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీనివాస్



అంబాజీపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రంజీ క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన సీనియర్ కోచ్ నిమ్మకాయల శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందినట్లు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. శ్రీనివాస్ ప్రస్తుతం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఆయన రంజీ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నారు. 2005లో ఏపీ రంజీ క్రికెట్ జట్టు ప్రోబబుల్స్‌లో ఎంపికయ్యారు. అంబాజీపేటలో నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రికెట్ సబ్ సెంటర్ కోచ్‌గా శ్రీనివాస్ తన ప్రస్థానం ప్రారంభించి నేడు రాష్ట్ర జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా ఉన్నారు. తన ఎంపిక పట్ల ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, ఏసీఏ ఎపెక్స్ కౌన్సిల్ సభ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన తేజస్వి గాత్ర కచేరీ


కీర్తన ఆలపిస్తున్న తేజస్విని

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సరస్వతి గాన సభ 122వ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. నగరంలోని సూర్యకళా మందిరంలో విజయవాడకు లంక తేజస్వి గాత్ర కచేరీ అలరించింది. ధన్యాసి రాగంలో నిఖిలలోక నాయకి వర్ణంతో ప్రారంభించి, దీక్షితుల వారి శ్రీగణేశాత్పరం, త్యాగరాజు స్వామి బంటురీతికొలువు.. మొదలైన కృతులు గానం చేశారు. ఆమెకు వయోలిన్‌పై అంబటిపూడి కామాక్షి, మృదంగంపై కార్తికేయ, ఘటంపై సరస్వతుల హనుమంతరావు వాద్య సహకారం అందించారు. సరస్వతి గానసభ సభ్యులు, అధిక సంఖ్యలో సంగీతప్రియులు పాల్గొన్నారు..

'తూర్పు'న ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు


వసంతవాడలో ప్రాజెక్టు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- రూ.1,600 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులకు శ్రీకారం
- వసంతవాడలో భూముల పరిశీలనలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ఆత్రేయపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షితమైన తాగునీటి జలాలను ప్రతి ఇంటికి అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు గాను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలివిడతగా రూ.1650 కోట్లతో వివిధ నియోజకవర్గాల్లో వాటర్ గ్రిడ్ పథకం పనులను ప్రారంభిస్తున్నట్టు అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం వసంతవాడ, దేశాలమ్మ ఫుంతలో రెండు ప్రాంతాల్లో ఈ పథకం కోసం అను వైన పంట పొలాలను ఆయన పరిశీలించారు. సుమారు పది ఎకరాలు భూసేకరణ కోసం చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సెంట్రల్ డెల్టా పరిధిలో బొబ్బర్లంక బ్యారేజీ నుంచి గోదావరి జలాలను శుద్ధి చేసి ట్రంక్ లైన్ల ద్వారా తాగునీరు అందించనున్నారు. బ్యారేజీ దిగువ నుంచి ఇన్‌టేక్ వెల్స్ నిర్మించి అక్కడ నుంచి దిగువకు మళ్లిస్తామన్నారు. దీనికి సంబంధించిన ప్లాంట్‌ను నిర్మించేందుకు భూములు పరిశీలిస్తున్నామన్నారు. సెంట్రల్ డెల్టా పరిధిలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలలో ట్రంక్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. అలాగే ఈస్ట్రన్ డెల్టా పరిధిలోని ధవళేశ్వరం బ్యారేజీ వద్ద శుద్ధి చేసిన జలాలను ఫిల్టర్ చేసి అనపర్తి, కాకినాడ, రామచంద్రపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలకు పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈస్ట్రన్ డెల్టా పరిధిలోని 250 గ్రామాలు, సెంట్రల్ డెల్టా పరిధిలోని 635 గ్రామాలకు తొలివిడత శుద్ధి చేసిన జలాలను అందిస్తామన్నారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ ఈ కాంట్రాక్టు చేపట్టిందన్నారు. శుద్ధి చేసిన జలాలు ట్రంక్‌లైన్ల ద్వారా రక్షిత మంచ నీటి పథకాలకు అనుసధానం చేసి ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా ప్రతి ఇంటి కుళాయిలకు చేరుతుంది. సురక్షిత జలాలను అందించి ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు ఈ ప్రాజెక్టు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఈ ప్రాజెక్టు సంబధించిన భూములను వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ పరిశీలించారు.ఈ కార్యక్రమం లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణా రెడ్డి, అమలాపురం ఆర్డీవో శ్రీకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఇంజనీర్లు పద్మనాభం, రవికుమార్, తహశీల్దారు రాజేశ్వరరావు, అసిస్టెంట్ ఇంజనీర్లు భాగ్యరాజు, శ్రీధర్, ఎస్ఐ ఎస్.రాము, టీడీపీ మండలాధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


భూసేకరణ పరిశీలిస్తున్న దృశ్యం

ఆరు పథకాలు.. అనేక ప్రయోజనాలు..

● గ్రామీణ ప్రజలకు తపాలా బీమాతో ధీమా
● తక్కువ ప్రీమియం.. ఎక్కువ బోనస్

సామర్లకోట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ఆరు రకాల బీమా పథకాలను అమలుచేస్తోంది. తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్‌లతో పాలసీదారులకు లాభాల భరోసాను ఇస్తోంది. సురక్ష, సువిధ, సుమంగళ్, సంతోష్, గ్రామప్రియ, చిల్డ్రన్ పాలసీ పేర్లతో ఆరు పథకాలను ప్రవేశపెట్టింది. ఒక్కో పథకం ద్వారా రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలు చేసుకునే అవకాశం కల్పించింది. వీటిలో ఒక్కో పథకానికి బోనస్‌ను రూ.60, రూ.48, రూ.45 చొప్పున అందించనుంది. లబ్ధిదారుడు మూడేళ్లపాటు జరిపిన చెల్లింపులపై రుణసదుపాయం కల్పిస్తోంది. ప్రీమియం చెల్లిస్తున్న సమయంలో పాలసీదారుడు మృతిచెందితే చెల్లించిన పాలసీ మొత్తాన్ని ఒకేసారి నామినీకి అందజేస్తారు. ఈ పథకాల్లో చేరదలిచినవారు ఆధార్, పాన్‌కార్డు కలిగి ఉండాలి. జిల్లాలోని ఏ పోస్టాఫీసులోనైనా ప్రీమియం చెల్లించవచ్చు. ఆదాయపు పన్ను రాయితీ, నామినేషన్ సదుపాయం, ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే అవకాశాన్ని తపాలా శాఖ కల్పించింది. పోస్టల్ జిల్లా ఉన్నతాధికారి అందించిన సమాచారం మేరకు తపాలా శాఖలో వివిధ పథకాల వివరాలు ఇలా ఉన్నాయి.

సంతోష్:
సంతోష్ పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. బోనస్ కింద రూ.1000కి రూ48 వర్తిస్తుంది. 19 ఏళ్ల లబ్ధిదారుడు పథకంలో చేరితే మెచ్యూరిటీని 35, 40, 45, 50, 55, 58, 60 ఏళ్లకు నిర్దేశించుకోవచ్చు. మెచ్యూరిటీ ఏ సంవత్సరం వరకూ అయితే నిర్దేశించుకుంటారో.. ఆ సంవత్సరం నుంచి మరో ఐదేళ్లపాటు వేచి ఉండాల్సి ఉంటుంది. అనంతరం పాలసీ మొత్తానికి రూ.48లు బోనస్‌గా అదనంగా జోడించి లబ్ధిదారుడికి అందజేస్తారు. రూ.10 లక్షల పాలసీ చేసిన లబ్ధిదారుడికి బోనస్‌తో కలిపి మొత్తం రూ.29.68లక్షలు పాలసీ మొత్తం వర్తిస్తుంది.

సురక్ష:
సురక్ష పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 55 సంవత్సరాల మధ్య కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. బోనస్ కింద రూ.1000కి రూ.60 వర్తిస్తుంది. 60 సంవత్సరాల వరకూ ప్రీమియం చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అనంతరం 80 ఏళ్ల తర్వాత రూ.10 లక్షలు, అందుకు సంబంధించి రూ.60 బోనస్‌తో కలిపి మెచ్యూరిటీ మొత్తాన్ని లబ్ధిదారుడికి అందజేస్తారు. లబ్ధిదారుడు మరణిస్తే ఆ మొత్తాన్ని నామినీకి అందజేస్తారు. రూ.10 లక్షలు పాలసీ 60 సంవత్సరాల పాటు చెల్లిస్తే బోనస్‌తో కలిపి దాదాపు రూ.34.60 లక్షలు లబ్ధిదారుడికి అందజేస్తారు. మూడేళ్ల తర్వాత పాలసీదారుడు రుణ సదుపాయం కూడా ఉంటుంది.

గ్రామప్రియ:
ఈ పథకంలో 10 సంవత్సరాల పాలసీ మాత్రమే నిర్ణయించారు. ఇందులోని 20 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారిని అర్హులుగా చేర్చారు. పథకంలో 10 సంవత్సరాల పాలసీలో మనీబ్యాక్ కింద 4,7 సంవత్సరాలకొకసారి 20 శాతం బోనస్ లభించనుంది. మిగిలిన మొత్తాన్ని పాలసీ ముగిసే సమయంలో బోనస్‌గా అదనంగా జోడించి అందచనున్నారు.

సువిధ:
సువిధ పథకం కింద రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పాలసీని సురక్ష పథకంలో మాదిరి 60 సంవత్సరాల వరకూ నిర్ణయించుకోవచ్చు. లేదా సంతోష్ పథకంలో నిబంధనల మేరకు కన్వర్ట్ చేసుకునే అవకాశం కల్పించారు. సురక్ష పథకం కింద ప్రీమియం చెల్లింపులు ఐదేళ్లపాటు చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత సంవత్సరంలోపు సంతోష్ పథకం కింద అయితే రూ.60 బోనస్.. సంతోష్ పథకం కింద కన్వర్ట్ చేసుకుంటే రూ.48 బోనస్‌గా లభిస్తుంది. లబ్ధిదారుడి చెల్లింపులు బట్టి బోనస్‌లు వర్తిస్తాయి.

సుమంగళ్:
ఈ పథకంలో రూ.10 వేల నుంచి రూ.10 లక్షల వరకూ పాలసీలను నిర్ణయించారు. 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారిని ఈ పథకానికి అర్హులుగా చేర్చారు. ఈ పథకంలో రూ.45లు బోనస్‌గా లభిస్తుంది. పథకంలో రెండు రకాల బోనస్‌లను నిర్ణయించారు. 15 సంవత్సరాల నుంచి పాలసీను ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీబ్యాక్ కింద 6 సంవత్సరాలకొకసారి, 9 సంవత్సరాలకొకసారి, 12 సంవత్సరాలకొకసారి 20 శాతం మనీబ్యాక్ రూపంలో బోనస్ లభించనుంది. అనంతరం మిగిలిన బోనస్‌ను పాలసీ ఎంచుకున్న లబ్ధిదారుడికి మనీ బ్యాక్ కింద 8 సంవత్సరాలు, 12సంవత్సరాలు, 16 సంవత్సరాలకొకసారి 20 శాతం చొప్పున మనీబ్యాక్ రూపంలో బోనస్ లభిస్తుంది. ఈ పథకంలో ఎలాంటి రుణసదుపాయం ఉండదు.

పిల్లల పాలసీ
ఈ పాలసీలో చేరే పిల్లలకు సంబంధించిన తల్లిదండ్రులు, సురక్ష, సువిధ పథకాల్లో లబ్ధి దారులై ఉండాలి. ఆయా పథకాల్లో ఉన్న తల్లిదండ్రుల పిల్లలకు మాత్రమే ఈ పథకం వర్తించనుంది. అది కూడా తల్లిదండ్రుల వయస్సు 45లోపు ఉండాలి. ఈ పథకంలో 5 నుంచి 20 ఏళ్లలోపు ఉన్న పిల్లలకు పాలసీ వర్తిస్తుంది. ఈ పథకంలో రూ.20 వేల నుంచి రూ.1లక్ష వరకూ పాలసీని నిర్ణయించారు. ఈ పథకంలో బోనస్ రూ.48గా నిర్ణయించారు.



ఖైదీ ప్రభాకర్‌ను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాల ఏర్పాటు

త్వరలో అరెస్టు చేస్తాం
కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్



దుద్దుకూరు హైవేపై పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ నరసింహకిషోర్



ఖైదీ ప్రభాకర్ (ఫైల్‌ఫొటో)

దేవరపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లు కప్పి తప్పించుకున్న సెంట్రల్ జైల్ ఖైదీ బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఇందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి ఖైదీ బత్తుల ప్రభాకర్‌ను కేసు విచారణ నిమిత్తం సోమవారం విజయవాడ తీసుకెళ్లి ఎస్కార్ట్‌తో రాజ మహేంద్రవరం వస్తూ రాత్రి దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారి వద్ద ఓ రెస్టారెంట్ వద్ద ఆపారు. దీంతో బత్తుల ప్రభాకర్ మూత్రం వస్తుందని చెప్పగా కుడిచేతికి ఉన్న సంకెళ్ల తొలగించడంతో ప్రభాకర్ పొలాల్లోకి పారిపోయాడు. పోలీసులు వెంబడించినా దొరకలేదు. దీంతో అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. దీనిపై కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ విలేకర్లతో సమావేశంలో మాట్లాడుతూ వ్యాన్‌లో ముగ్గురు ఖైదీలు ఉన్నారని, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ బత్తుల ప్రభాకర్ కోసం ఏపీ, తెలంగాణలో గాలింపు ముమ్మరం చేశామన్నారు. ప్రభాకర్ గతంలో దేవరపల్లి ప్రాంతంలో ఒక స్కూల్ వద్ద రూ.3లక్షలు నగదును చోరీ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఉండ్రాజవరంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో రూ.30 లక్షలు చోరీ కేసులో కూడా నిందితుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభాకర్‌ను పట్టుకోవడానికి 15 మంది చొప్పున 3ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. డ్రోన్‌తో సాంకేతిక పరిజ్ఞానంతో చెక్‌పోస్టుల ద్వారా జాబ్‌కార్డులతోనూ ముమ్మరంగా దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు. ఏలూరు ఐజీ అశోక్ కుమార్, తూర్పుగోదావరి జిల్లా జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలు, సూచనల మేరకు నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. బత్తుల ప్రభాకర్ ఏపీ, తెలంగాణలో 66 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. ప్రభాకర్‌ను త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు.

గూగుల్ క్లౌడ్‌తో 'ఆదిత్య' ఎంవోయూ



ఎంవోయూ కుదుర్చుకున్న గూగుల్ క్లౌడ్, ఆదిత్య ప్రతినిధులు

గండేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్‌తో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుని గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్ (ఎలైట్ టియర్)గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌లోని తొలి యూనివర్సిటీగా నిలిచిందని ప్రో చాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ భాగస్వామ్యంతో ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా గూగుల్ క్లౌడ్ సర్టిఫికేషన్లు, అకడమిక్ ప్రోగ్రామ్‌లు, అండర్ గ్రాడ్యుయేట్ పాఠ్యక్రమాల్లో భాగం కానుండగా విద్యార్థులకు ఇండస్ట్రీ-లింక్డ్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనా సహకారాలు వంటి అవకాశాలు కల్పిస్తారన్నారు. కార్యక్రమానికి సౌత్ ఇండియా గూగుల్ క్లౌడ్ రీజినల్ హెడ్ సిద్ధార్థ దల్వాడి ముఖ్య అతిథిగా, హెనోటిక్ గ్రూప్ వ్యవస్థాపకుడు సీఈవో బి.మల్లేశం గౌరవ అతిథిగా హాజరయ్యారు. గూగుల్ క్లౌడ్‌కి చెందిన ప్రతినిధి బృందంతో పాటు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్.ఎస్.రమాశ్రీ (ప్రో వైస్ చాన్సలర్ అకడమిక్స్), డాక్టర్ ఎ.రమేష్ (ప్రో వైస్ చాన్సలర్, ఇంజనీరింగ్/సైన్సెస్), డాక్టర్ రవి ధంగజాం (ప్రో వైస్ చాన్సలర్, స్ట్రాటజీ/ పార్టినర్‌షిప్స్), డాక్టర్.జి.సురేష్ (రిజిస్ట్రార్) పాల్గొన్నారు. కార్యక్రమం కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.రాజాబాబు వ్యవహరించారు.

తప్పుడు సర్టిఫికెట్‌తో డీఎస్సీలో ఉద్యోగం



జయశాంతి (ఫైల్‌ఫొటో)

కాకినాడ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేటలో నివసిస్తున్న ఆముదాల జయశాంతి తాజా డీఎస్సీ నియామకాల్లో ఉద్యోగం పొందింది. అయితే తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాన్ని దక్కించుకున్నట్టు తదనంతర విచారణలో వెల్లడైంది. వివరాల్లోకి వెళితే రంగంపేట పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జయశాంతి తాజాగా డీఎస్సీలో ఉద్యోగానికి అర్హత సాధించింది. ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) కోటాలో ఆమె ఉద్యోగం పొందింది. అయితే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తీసుకోవడంలో అవకతవకలకు పాల్పడింది. ఆమెకు వివాహం కాగా భర్త తాతారావు కానిస్టేబుల్ సంపాదనను దాచి తండ్రిని సంరక్షకుడిగా ప్రస్తావిస్తూ తన ఉద్యోగాన్ని మాత్రమే చూపి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందింది. అయితే ఉద్యోగ జాబితాలో ఆ మెరుగు తర్వాత స్థానంలో ఉన్న అభ్యర్థులు విషయాన్ని తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యాశాఖ ఆమె అందించిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌పై విచారణ చేపట్టింది. అవకతవకలకు పాల్పడినట్టు నిర్ధారణ అయ్యింది. దీంతో ఆమె నుంచి అధికారులు వివరణ తీసుకున్నారు. జయశాంతి చేసిన మోసం తెలిసి ఉద్యోగాన్ని తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. పోలీస్‌శాఖ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతోంది.

భార్యపై భర్త హత్యాయత్నం

● కోనసీమ జిల్లా కోటిపల్లిలో ఘటన ● ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కె.గంగవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కోటిపల్లి గ్రామంలో భార్యపై హత్యాయత్నం చేసిన భర్తపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్టు పామర్రు ఎస్‌ఐ ఎస్.కె. జానీ బాషా చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోటిపల్లి గ్రామానికి చెందిన మొగమాటి అశ్వనికి, రామచంద్రపురానికి చెందిన దత్తవీరవెంకట శివకుమార్‌కు వివాహం అయ్యింది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల శివకుమార్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో అశ్వని కోటిపల్లిలో ఉంటుంది. సోమవారం రాత్రి శివకుమార్ దళితవాడలో ఉన్న అశ్వని వద్దకు వచ్చి గొడవ పడ్డాడు. కులం పేరుతో దూషించాడు. అశ్వనిని కడుపులో తన్ని చంపడానికి ప్రయత్నించాడు. ఈ మేరకు అశ్వని ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. మంగళవారం అమలాపురం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కె.ప్రసాద్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధిత మహిళ నుంచి వివరాలు సేకరించారు. మహిళల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శివకుమార్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు.

అంతర్వేదిలో నటి కవిత పూజలు

అంతర్వేది, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి మంగళవారం సినీ నటి కవిత కుటుంబ సమేతంగా విచ్చేసి పూజలు చేశారు. ఆమెకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి ఆలయంలో దర్శనం నిర్వహించి వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందించారు.



నటి కవితకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

రోడ్డెక్కిన మత్స్యకారులు

● డిమాండ్లను పరిష్కరించాలని ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆందోళన ● రసాయన పరిశ్రమలపై ఆగ్రహం





కాకినాడ జిల్లా ఉప్పాడలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, ఆందోళనకారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

కొత్తపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించి, న్యాయం చేయాలని తీరప్రాంత మత్స్యకారులు మూకుమ్మడిగా రోడ్డెక్కారు. కాకినాడ జిల్లా ఉప్పాడ, అమీనబాద్ గ్రామాలకు చెందిన సుమారు 500 మంది మత్స్యకారులు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆందోళన చేపట్టారు. ఉప్పాడ-కాకినాడ, కాకినాడ-తుని, ఉప్పాడ- పిఠాపురం రోడ్లకు మత్స్యకారులు ఐరన్ టేబుళ్లను అడ్డంగా వేసి రహదారులను నిర్బంధం చేశారు. సాయంత్రం 6 గంటల వరకు ఆందోళన సాగించారు. సముద్ర తీరప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల నుంచి విడుదల చేసిన రసాయనాల కారణంగా మత్స్యసంపద పూర్తిస్థాయిలో నశించిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో సముద్రంలో చేపలు దొరుకుతాయనే నమ్మకంలేదని వాపోయారు. వేట తప్ప మరో ఉపాధి తమకు తెలియదని, రసాయన పరిశ్రమల వల్ల ఉపాధి కోల్పోయిన మత్స్యకారులకు టుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వేట లేని సమయంలో వేరే ప్రాంతాలకు వెళ్లి వేట చేసేటపుడు అక్కడ మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య పరిశ్రమల కారణంగా జీవనోపాధి కోల్పోయిన ప్రాంతాల్లో మత్స్యకారులకు ఆయా కంపెనీలు నష్టపరిహారం చెల్లించాయని, అదేవిధంగా కూడా తమకు నష్టపరిహారం చెల్లించాలని ముక్తకంఠంతో విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఉప్పాడ-అమీనబాద్ మినీహార్బర్ నుంచి వేటకు వెళ్లిన మత్స్యకారుల బోట్లు తిరగబడి పలువురు మత్స్యకారులు మృత్యువాత పడ్డారని, హార్బర్ నిర్మాణంలో లోపాలున్నాయని వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల సమస్యలన్నింటిపై కలెక్టర్ లేదా ఎమ్మెల్యే పవన్ కానీ హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించే ప్రసక్తిలేదని వారు హెచ్చరించారు.

కాలుష్య పరిశ్రమలపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు : జేసీ

మత్స్యకారుల ధర్నా వద్దకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా వెళ్లారు. తీర ప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల నుంచి విడుదల చేస్తున్న వ్యర్థజలాల కారణంగా మత్స్యసంపద అంతరించిపోతుందన్న విషయంపై నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు చేపడతామని మత్స్యకారులకు వివరించారు. అదేవిధంగా ఓఎన్‌జీసీ, ఇతర కంపెనీలు ఆయా ప్రాంతాల్లో నష్టపోయిన మత్స్యకారులకు చెల్లించిన నష్టపరిహారాల నివేదికలను పరిశీలించి తగు చర్యలు చేపడతామని స్పష్టంచేశారు. వేట లేని సమయంలో వేరే ప్రాంతానికి వెళ్లి వేట చేసే సమయంలో ఇబ్బందులు పడుతున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారులకు, మత్స్యశాఖ మంత్రి ఆధ్వర్యంలో 2రోజుల్లో సమావేశం ఏర్పాటు చేస్తామని, స్థానిక మత్స్యకార పెద్దలు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు ఆందోళనే...

బుధవారం ఉదయం కూడా మత్స్యకారులంతా ఆందోళనలో పాల్గొనాలని మత్స్యకార నాయకులు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం ఉప్పాడ విచ్చేసి స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేదిలేదని మత్స్యకార పెద్దలు హెచ్చరించారు. ఒకవేళ డిప్యూటీ సీఎం పవనకల్యాణ్ సానుకూలంగా స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసేందుకు సమాయత్తం కావాలని సాయంత్రం జరిగిన మత్స్యకారుల సమావేశంలో ఏక గ్రీవంగా తీర్మానించారు.

డిప్యూటీ సీఎం రావాల్సిందే..

మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామని జేసీ చెప్తుండగా కలెక్టర్ కానీ, డిప్యూటీ సీఎం ఆందోళన దగ్గరకు వచ్చి హామీ ఇస్తేకానీ విరమించేది లేదని మత్స్యకారులు హెచ్చరించారు. పరిస్థితిని గమనించిన కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు ఫోన్‌లో డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయ అధికారులతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం శాసన సభ సమావేశాల్లో ఉన్నారన్న సమాధానం రావడంతో ఆందోళన కారులకు తెలియజేశారు. అందుకు మత్స్యకారులు ససేమిరా అనడంతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ కొత్తపల్లి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. మత్స్యకార నాయకులను తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సిందిగా ఆర్డీవో తెలియజేశారు. కానీ వారు ఎంతకీ వెళ్లకపోగా డిప్యూటీ సీఎం వస్తేకానీ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేయడంతో కలెక్టర్‌తో అందరూ వెను దిరిగారు. కోనపాపపేటలో కూడా మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. ఉమ్మిడిజాన్, నక్కా మణిం కంఠ, సూరాడరాజు, సూరాడ నాగేశ్వరరావు, మేరుగుభూషణం, ఎల్లాజీ, చోడిపల్లి ప్రసాద్ తదితర మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో విద్యుదాఘాతం

హై ఓల్టేజీతో 40 గృహాల్లో ఏసీ, వాషింగ్ మిషన్లు, మిక్సీలు, ఫ్యాన్లు దగ్ధం



కాలిపోయిన ఏసీ, వాషింగ్ మిషన్



సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం శివారు మారుతీనగర్‌లో సోమవారం తెల్లవారుజామున హైఓల్టేజీ కారణంగా సుమారు 40 ఇళ్లలో సుమారు రూ.10 లక్షల విలువైన ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్లు, ఫ్యాన్లు, టీవీలు, లైట్లు మాడిపోయాయి. దీంతో మారుతీనగర్ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మారుతీనగర్‌లో సుమారు 250 గృహాలు ఉండగా వారి విద్యుత్తు అవసరాల కోసం స్థానికంగా 60, 40 వోల్టు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్తు శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. సోమవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి పొగలు రావడం, కరెంటు నిలిచి గృహోపకరణాలు హైఓల్టేజీతో దగ్ధం అయ్యాయి. సోమవారం అర్ధరాత్రి హైఓల్టేజీ సంభవించి, విద్యుత్తు సరఫరా నిలిచిపోతే మంగళవారం మధ్యాహ్నం 3 గంటల కూడా విద్యుత్ పునరుద్ధరణ చేయలేని పరిస్థితిలో విద్యుత్తు సిబ్బంది ఉన్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలిపోయిన గృహోపకరణాలను తిమ్మాపురం గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పరిశీలించారు. జరిగిన నష్టాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. హై ఓల్టేజీతో జరిగిన నష్టాన్ని, విద్యుత్ పునరుద్ధరణపై కాకినాడ ఏడీఈ దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్లు భూమికి తక్కువ ఎత్తులో, రక్షణ లేకుండా ఉన్నాయని తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

మల్లిశాలలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు అంశం పరిశీలిస్తాం : మంత్రి భరత్

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే నెహ్రూ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ

అమరావతి/జగ్గంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిశాల గ్రామంలో అందుబాటులో ఉన్న 525 ఎకరాల ప్రభుత్వ భూమిలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. మల్లిశాల గ్రామంలో ఒకే చోట ఉన్న 525 ఎకరాల భూమిలో గతంలో 42 టైల్స్ ఫ్యాక్టరీలు ఉండేవని, ఇప్పుడు అవన్నీ మూతబడిపోవడంతో వాటిపై ఆధారపడి జీవించే వేలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ను ఏర్పాటుకు రోడ్డు, రైల్వే, ఎయిర్ కనెక్టివిటీతో పాటు నీటి లభ్యత పుష్కలంగా ఉందని తెలిపారు. ఇక్కడ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేస్తే మా ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కోరారు. దీనిపై మంత్రి భరత్ స్పందిస్తూ.. 'ఇటీవల ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు దుబాయ్ ప్రభుత్వ ప్రతినిధులకు కొన్ని భూముల చూపించాం. మల్లిశాలలోని 525 ఎకరాల భూమి గురించి కూడా వారి దృష్టికి తీసుకువెళతాం. వారు కాదంటే ఏపీఐఐసీ ద్వారా ఏవిధంగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయొచ్చనే దానిపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలతో ముందుకువెళ్తున్నాం. ఇప్పటికే పలు పార్కులు ప్రారంభించాం. మరికొన్నింటికి శంకుస్థాపన చేశాం. త్వరలో మరో 30 పార్కులను ప్రారంభించనున్నాం' అని పేర్కొన్నారు.

ఒమ్మంగి సొసైటీకి జరిమానా

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి కలెక్టర్ షాన్‌మోహన్ రూ.25వేలు పెనాల్టీ విధించారు. ఒమ్మంగి పీఏసీఎస్ యూరియా ఎరువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడటంపై కలెక్టర్ ఈ చర్యలు తీసుకున్నారు. ఈ ఆదేశాలు మంగళవారం ఒమ్మంగి పీఏసీఎస్‌కు అందజేసినట్టు మండల వ్యవసాయాధికారి జోకా అమృత తెలిపారు.

కారులో గంజాయి రవాణా

జగ్గంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం టోల్‌ప్లాజా వద్ద మంగళవారం ఆర్‌జే60 యూఏ 4616 నెంబరుగల ఇన్నోవా కారులో గంజాయి రవాణా చేస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వారు కారును పట్టుకోవడానికి యత్నించగా కృష్ణవరం టోల్‌ప్లాజాను దాటి అడ్డదారిన పెద్దాపురం మండలం దివిలి గ్రామం వెళ్లి సుమారు 200 కిలోల గంజాయి బస్తాలను వదిలేసి కారు సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం వైపు వెళ్లినట్టు తెలిసింది.

వివాహిత అదృశ్యంపై కేసు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య గత కొంత కాలంగా విబేధాలు ఉన్న నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి భార్య కనిపించడం లేదని భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అమలాపురంపట్టణ ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన ఉప్పే లక్ష్మణ్‌తో విజయకుమారి (29)కి వివాహం జరిగింది. వారి మధ్య విబేధాల నేపథ్యంలో గత 5 నెలలుగా భార్య విజయకుమారి విడిగా ఉంటుంది. అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లోని ఒక అపార్టుమెంట్‌లో అక్క వద్ద ఉంటున్న విజయకుమారి తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం అన్నిచోట్లా గాలించినా ప్రయోజనం లేకపోవడంతో భర్త లక్ష్మణ్ అమలాపురం పట్టణ పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

50 సీసాలు స్వాధీనం

ఎటపాక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని ఓ బడ్డీ దుకాణంలో బెల్ట్ షాపు నిర్వహిస్తూ అమ్మకాలు చేస్తుండగా మంగళవారం ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది దాడి చేశారు. 50 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేశారు. ఈక్రమంలో నెల్లిపాక మద్యం దుకాణం నుంచి ఆయా గ్రామాల బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తున్న వారి నుంచి సుమారు 95 బాటిళ్ల మద్యంసీసాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

పద్మకు సన్మానం
మలికిపురం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి)నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన దిండి మాజీ సర్పంచ్ బందెల పద్మను రాజోలు నియోజకవర్గ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సన్మానించారు. గెడ్డం పేర్రాజు, నక్కా రామారావు, చింతా రాజబాబు, గెడ్డం ఫిలిప్‌రాజు, గెడ్డం సింహ, నల్లి శివకుమార్, జిల్లెల్ల బాబుప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతి సత్రం ప్రారంభానికి ఆహ్వానం
మలికిపురం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీశ్రీనివాసా ఉమారామలింగేశ్వర నిత్యాన్నదాన దేవాంగ సత్రం అక్టోబరు4నప్రారంభోత్సవం సందర్భంగా రెవెన్యూ స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు కమిటీ సభ్యుడు చింతా వీరభద్రేశ్వరరావు ఆహ్వానపత్రం అందజేశారు. పప్పుల రమేష్, బూసిం రమేష్ పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా విజయదుర్గమ్మ దర్శనం





అమలాపురం: ఈదరపల్లి వంతెన వద్ద గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు, ముమ్మిడివరం: చినకొత్తలంకలో గాయత్రీదేవిగా విజయదుర్గమ్మ, అల్లవరంలో అలంకరణలో విజయ కనకదుర్గమ్మ

ముమ్మిడివరం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం చినకొత్తలంకలో పట్టాభిరామస్వామివారి ఆలయంలో విజయదుర్గమ్మ మంగళవారం గాయత్రీదేవిగా దర్శమిచ్చారు. అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ మెయిన్‌రోడ్డులోని ఈశ్వరమ్మ ఆలయంలో శ్రీవిజయదుర్గమ్మ మంగళవారం బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని బాలత్రిపురసుందరిగా అలంకరింపచేసి ప్రత్యేక పూజలు జరిపించారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాంలోని వివిధ ఆలయాల్లో కనకదుర్గమ్మ రెండో రోజు మంగళవారం వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చారు. యానాం శివారు గిరియాంపేటరోడ్డులోని శ్రీపాలకనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వరంలో బాల పూజ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శినమిచ్చారు. పడవలరేవు వీధిలోని లలితాదేవి ఆలయంలో అమ్మవారు కౌమారిదేవిగా, గోపాల్ నగర్‌లోని శారదాదేవి (సరస్వతి) ఆలయంలో, శివాలయం ప్రాంగణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్లు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాయత్రీ దేవిగా శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు దర్శనమిచ్చారు. గంటిపెదపూడిలో శ్రీమసేనమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో శ్రీకనకదుర్గమ్మకు ప్రత్యేక అభిషేకాలు, సామూహిక సహస్ర కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకనకదుర్గ ఆలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మురమళ్ల శ్రీభద్రకాళీ అమ్మవారు మంగళవారం విశేష అలంకరణతో దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అమలాపురం, (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని కల్వకొలను వీధి వేపచెట్టు ఆలయం వద్ద రెండో రోజు దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి శతచండీ సహిత రుద్రయాగం ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు కుటుంబ సమేతంగా అమ్మవారి రుద్రయాగంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేపచెట్టు కనకదుర్గమ్మవారిని దర్శించుకుని పూజాకార్యక్రమాలు చేశారు. పట్టణంలోని వివిధప్రాంతాలకు చెందిన దంపతులు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారికి రుద్రయాగం నిర్వహించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవార్ని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాయత్రిదేవిగా అలంకరించారు. ఈసందర్భంగా ఆలయంలోమహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అంబాజీపేట సంత మార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అంబాజీపేట విజయభేతాళస్వామి, పక్షులరావిచెట్టు వద్ద అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరనన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు దుర్గాలయాల వద్ద మంగళవారం చండీ హోమాలు, కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. అల్లవరం విజయ కనకదుర్గమ్మ ఆలయంలో కంకిపాటి గోపాలకృష్ణతో కలశస్థాపన, కంకిపాటి శ్రీనివాస్ దంపతులతో దుర్గా చండీ హోమం, కుంకుమ పూజలు జరిగాయి. వేదపండితులు మంగళంపల్లి పాండురంగ విఠల్ బ్రహ్మత్వాన దుర్గాచండీ హోమాది పూజలు జరిగాయి. కొమరగిరిపట్నం కాశీవిశ్వేశ్వరాలయం వద్ద దుర్గాదేవి అమ్మవారిని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు దర్శించుకున్నారు. కొమరగిరిపట్నంలో మెట్ల రేవతి, గుర్రం ఏసుబాబు, నిమ్మకాయల సుబ్బారావుల ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనకు భక్తులు పోటెత్తారు. అల్లవరం, గోడితిప్ప, మొగళ్లమూరి, బెండమూర్లంక, గోడిలంక, గోడి, బోడసకుర్రు, కోడూరుపాడు, డి.రావులపాలెం, యెంట్రుకోన తదితర గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం రెండోరోజు కనకదుర్గమ్మ ఆలయాలుభక్తులతో కిటకిటలాడాయి. పెదపట్నంలంకలోని కనకదుర్గమ్మవారు మంగళవారం బ్రహ్మచారిణి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాశర్లపూడి బాడవ ఆలయంలో శతచండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష్మీగణపి అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో శ్రీమహాలక్ష్మీఅమ్మవారు ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు కనువిందుచేశారు. పలు గ్రామాల్లో కుంకుమార్చనను జరిపారు.ఆయాకార్యక్రమాల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ జైచంద్రగాంధీ

మలికిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత మహిళలు ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా డీఆర్డీఏ పీడీ జైచంద్రగాంధీ అన్నారు. మంగళవారం మలికిపురం వెలుగు కార్యాలయంలో డీఆర్డీఏ, జిల్లా చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మహిళల శిక్షణ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకురావడానికి ఎటువంటి సెక్యూరిటీ లేకుండా బ్యాంకు రుణాలు, స్త్రీనిధి ద్వారా అనేక రుణాలు ఇస్తూ ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా చిన్నతరహా పరిశ్రమల ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆహార ఉత్పత్తి పరిశ్రమలకు సబ్సిడీలు అధికంగా ఇస్తున్నాయన్నారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జిల్లా ఎండీ శివరామప్రసాద్, ఏపీఎం షేక్ సయ్యద్, ఎంపీపీ ఎంపీ సత్యవాణి, జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, డీపీఎం గణేష్, ఇండస్ట్రీస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాస్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దివ్విభవానీ, కడిమి దివ్య, దళం అశ్విని పాల్గొన్నారు.

11కేవీ విద్యుత్ లైన్ల పనులు నిలిపివేయాలి



గంగలకుర్రులో విద్యుత్ లైన్ల పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్న స్థానికులు

అంబాజీపేట, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు సిద్ధార్థనగర్‌లో నివాస ప్రాంతాల మధ్య నుంచి వేస్తున్న 11కేవీ విద్యుత్‌లైన్ల పనులు తక్షణం నిలుపుదల చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. గంగలకుర్రు సిద్ధార్థనగర్‌లో రక్షిత మంచినీటి ట్యాంకును నిర్మించారు. ఈట్యాంకుకు విద్యుత్ సరఫరా అవసరం కావడంతో పంచాయతీ ద్వారా విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుచేసి ఆ ట్యాంకుకు విద్యుత్ సరఫరా అందించేందుకు మంగళవారం విద్యుత్‌లైన్ల పనులు ప్రారంభించారు. అయితే 11కేవీ విద్యుత్‌లైన్లు భవనాలు అతిదగ్గర్లో నుంచి వెళ్లడంతో ప్రమాదాలకు గురవుతామని భావించి పనులను స్థానికులు అడ్డుకున్నారు. దీంతో విద్యుత్ శాఖ సబ్‌ఇంజనీర్ మోహన్, సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సత్యవేణి ఆ ప్రాంతానికి చేరుకుని స్థానికులతో చర్చించారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ కె.చిరంజీవి తన సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకుని అధికారులు, స్థానికులతో చర్చించారు. ఒకదశలో స్థానికులు అధికారులపై తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. దీంతో ఎస్ఐ వారిని వారించారు. పక్క వీధిలో ఖాళీ స్థలాల నుంచి 11కేవీ విద్యుత్‌లైన్లు వేయాలని స్థానికులు సూచించారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేసి లైన్లు వేస్తామని సబ్‌ఇంజనీర్ మోహన్ తెలపడంతో వివాదం సద్దుమణిగింది.

ఆర్థిక సహాయం
మలికిపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ సమకూర్చిన రూ.10వేలను చింతలమోరిలో అనారోగ్యంతో బాధపడుతున్న నల్లి ఊర్మిళకు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ అందజేశారు. కొల్లాబత్తుల అశోక్, రాపాక చిన్నీ, నల్లి ప్రసాదరావు, సలాది మూర్తి పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
ముమ్మిడివరం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వినియోగించడం వల్ల జీవితాలు నాశనమవుతాయని, వాటికి దూరంగాఉండాలని ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సూచించారు. డ్రగ్స్ నివారణపై చినకొత్తలంకలో మంగళవారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పర్యవేక్షిస్తుండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పొత్తూరి మల్లికార్జునరావు, మహిళా పోలీసు పి.రూప, కూటమి నాయకులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పోషకాహార ప్రదర్శన
అల్లవరం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):కొమరగిరిపట్నం మిలటరీ కాలనీలో పోషణ్ మహామాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పోషకాహార ప్రదర్శన జరిగింది. మిగిలిన వ్యర్థాలతో బొమ్మల తయారీపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలిచ్చే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు సూచించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ కుమారి, అంగన్‌వాడీలుపాల్గొన్నారు.

సహకార సంఘం మహాజన సభ
అంతర్వేది, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అంతర్వేది ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు రావూరి నాగు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్ గణేశ్వరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సహకార సంఘం జమా ఖర్చులు, సంఘానికి దరఖాస్తు చేసుకున్న వారిని కొత్త మెంబర్లగా చేర్చుకోవడానికి, రైతు నేస్తం రుణం ఎకరానికి రూ.8లక్షలు ఇచ్చేలా, రైతులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందించేలా, సంఘ చైర్మన్ ప్రవేశపెట్టబడిన ఇతర విషయాల గురించి చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జాన్‌బాబు, రవికుమార్, ఎంపీటీసీ బైరా నాగరాజు, పోతురాజు సురేష్, నీటిసంఘం ఉపాధ్యక్షుడు ఆకన బాబ్జినాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం
ఐ.పోలవరం, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): బెంగళూరుక చెందిన శ్రీరమ్యరాకేష్ మురమళ్ల శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10,001 విరాళం మంగళవారం ఆలయ సిబ్బందికి అందించారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. దాతను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అభినందించారు.

నేటి నుంచి యానాం వెంకన్న బ్రహ్మోత్సవాలు
యానాం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాం శ్రీభూసమేత వేంకటేశ్వ రస్వామి బాలాలయంలోత్రివింశతి(23వ)బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఆలయ అధికారులు, పలువురి దాతల సహకారంతో పది రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. బుధవారం ఉదయం 7.25 గంటలకు స్వామివారి సన్నిధిలో కరకుదురు వాస్తవ్యులు వాడపల్లి గోపాలాచార్యుల నేతృత్వంలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడతారు. ప్రతిరోజు ఆరాధానోత్సవాలు, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆలయ ఈవో జ్యోతి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవదారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను రద్దుచేయాలి



త్రిరత్న బుద్ధవిహార్‌లో మాట్లాడుతున్న నకులరాజు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏపీఎస్సీ వెల్ఫేర్ జిల్లాశాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు డిమాండ్ చేశారు. ఆయన అధ్యక్షతన షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో నిర్వహించారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదవిద్యార్థులు తీవ్రంగానష్టపోతారన్నారు. పేదవారికి ఉచితంగా విద్యా, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సర్వ సభ్య సమావేశాన్ని అక్టోబరు నెల రెండో శనివారం నిర్వహించాలని తీర్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఎం.రవి, డి.రమేష్, కె.శేషగిరిరావు, మట్టా శ్రీనివాస్, బయ్యా మోహన్, గెడ్డం ప్రదీప్, కె.కల్యాణ్‌బాబు, తోట సత్యనారాయణ, జ.రవికుమార్ పాల్గొన్నారు.

అకాడమీ చైర్మన్‌కు ఎమ్మెల్యే అభినందనలు
పి.గన్నవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జానపద, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా నియమితులైన వంపూరు గంగులయ్యను విజయవాడలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జానపద సాహిత్య సేవలు, సృజనాత్మకతకు చేసిన కృషి, తెలుగు సంస్కృతి సంప్రదాయాలను విస్తృతంగా గంగులయ్య ప్రాచుర్యం చేసిన కృషిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని ఎమ్మెల్యే అన్నారు. గంగులయ్యను దుశ్శాలువాతో సన్మానించారు.

జీఎస్టీ తగ్గింపు..
మోదీ చిత్రపటానికి పాలాభిషేకం
అమలాపురం,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని యర్రమిల్లివారి పెట్రోలు బంకు వద్ద మంగళవారం సాయంత్రం జీఎస్టీని తగ్గించిన నేపథ్యాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు యర్రమిల్లి వీరేశ్వరరావు అధ్యక్షతన బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. బీజేపీ మాజీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్‌తో పాటు బీజేపీ నాయకులు మోకా వెంకటసుబ్బారావు, పీఆర్ స్వామి, కె.చిన్నా, సూరిబాబు, పచ్చిగోళ్ల నర్సిబాబు, నంబూరి శ్రీనివాస్, గ్రంధి గుప్తా, పాలూరి సత్యానందం, యర్రమిల్లి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు అడపా సత్యనారాయణ, దూరి రాజేష్, చిట్టూరి రాజేశ్వరి, యిళ్ల సత్యనారాయణ, కొండేటి ఈశ్వర్‌గౌడ్, కట్టా నారాయణమూర్తి, కురసాల గోవిందు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కార్మిక రంగానికి రాము చేసిన సేవలు అమూల్యం
అమలాపురం రూరల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్మిక రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు వారి సంక్షేమం కోసం ఎనలేని కృషి చేసిన ఘనత గళ్లా రాముకు దక్కుతుందని తులా రాంబాబు పేర్కొన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దశాబ్దాల కాలం పనిచేసిన రాము కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలులోకి తీసుకువచ్చారన్నారు. కామనగరువు సెయింట్ జోసెఫ్ ఓల్డేజ్ హోంలో రాము జయంతి వేడుకలను కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాము చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వృద్ధాశ్రమంలో అల్పాహారం అందించి పాలు, పండ్లు పంపిణీ చేశారు. రాము కుటుంబ సభ్యులు గళ్లా దేవినిరంజని, గళ్లా భాగ్యలక్ష్మి, తులా సత్యనారాయణ, తులా లోకేశ్వరరావు, మమత, సత్య పాల్గొన్నారు.

రెండు నెలల్లో డీఎస్పీ కార్యాలయ నిర్మాణం పూర్తి
పరిశీలించిన ఎస్పీ రాహుల్ మీనా



డీఎస్పీ కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని ఆర్డీవో కార్యాలయం వెనుక నిర్మిస్తున్న డీఎస్పీ కార్యాలయ భవనాన్ని ఎస్పీ రాహుల్‌మీనా పరిశీలించారు. సీఎస్సార్ నిధులతో నిర్మిస్తున్న ఈభవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలతో నిర్మితమయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. భవన నిర్మాణ, నాణ్యతల వివరాలను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీరాజ్ అన్యం రాంబాబు ఎస్పీకి వివరించారు. రెండు నెలల్లో నిర్మాణం పూర్తవుతుందని ఎస్పీకి రాంబాబు తెలిపారు. డీఎస్పీ ప్రసాద్, పట్టణ సీఐ వీరబాబు, పీఆర్ఏఈ సంపన్ పాల్గొన్నారు.

30న తపాలా అదాలత్
అమలాపురంటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 30న తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్టు అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ తెలిపారు. తపాలా సర్వీసులకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే అదాలత్‌లో చర్చించి పరిష్కరిస్తామన్నారు. అమలాపురం డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, వ్యక్తిగత సమస్యలను ఈనెల27వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. తపాలా అదాలత్ శీర్షికతో.. సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీసెస్, అమలాపురం డివిజన్, అమలాపురం-533201 చిరునామాకు పంపించాలన్నారు. గడువు తేదీ తరువాత వచ్చే దరఖాస్తులను పరిగణలోనికి తీసుకోమన్నారు. ఫిర్యాదుదారులు వ్యక్తిగతంగా కూడా 30వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరు కావచ్చునన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

మామిడికుదురు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ వారు మంగళవారం భోజన విరామ సమయంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖకు అప్పగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో అందించారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ దరఖాస్తుల ఆహ్వానం
ముమ్మిడివరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయసేవా సాధికార సంస్థ జస్టిస్ ఫర్ ఆల్ త్రూ ద లైన్స్ ఆఫ్ లీగల్ ఎయిడ్ అనే ఏకీకృత అంశంతో జాతీయ ఫొటోగ్రఫీ, ఆర్ట్ ఫోకస్ ప్రారంభించామని ముమ్మిడివరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. న్యాయ సహాయ సేవల పరిధి ప్రభావాన్ని సృజనాత్మకంగా ప్రజల ముందుకు తీసుకువెళ్లడం ఈకార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. ఆయా రంగాల్లో ప్రతిభ కలిగిన వారి నుంచి ఫొటోలు, పెయింటింగ్‌లు, స్కెచ్‌లు, నిమిషం నిడివిగల షార్ట్ వీడియోలను ఆహ్వానిస్తున్నామన్నారు. అక్టోబరు 1వ తేదీలోపు దరఖాస్తులను మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యాలయానికి అందజేయాలన్నారు. మండల న్యాయ అధికార సంస్థ ద్వారా అందిన ప్రతులను స్కానింగ్‌చేసి జిల్లా న్యాయాధికార సంస్థకు పంపుతామన్నారు. ఎంపికైన ఉత్తమ వాటిని జాతీయ స్థాయికి పంపించి ప్రదర్శనలు చేయనున్నట్టు తెలిపారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ప్రసాద్



అమలాపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా తిరిగి ఎస్కేడీవీ ప్రసాద్‌ను నియమిస్తూ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ప్రసాద్ పనిచేశారు. అయితే జిల్లాలో బార్ పాలసీకి నిర్వాహకుల నుంచి ఆశించిన మేర స్పందన లేకపోవడంతో ఆ పరిణామాల నేపథ్యంలో ప్రసాద్‌ను ఆకస్మికంగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కాకినాడ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుకను కోనసీమజిల్లాకు ఇన్‌చార్జిగా నియమించారు. ప్రసాద్‌ను తిరిగి జిల్లా సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

వీధి వ్యాపారుల సంక్షేమానికి 'స్వనిధి యోజన'
ముమ్మిడివరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ స్వనిధి యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని, ఆ పథకాన్ని వీధి వ్యాపారులంతా సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.రవివర్మ సూచించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సిటీ మిషన్ మేనేజర్ సోమానీ భాస్కర్ అధ్యక్షతన బ్యాంకర్లు, వీధి వ్యాపారులకు నిర్వహించిన లోక్ కల్యాణ్ మేళా కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. వీధి వ్యాపారుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి మోదీ స్వయంగా లోక్‌కల్యాణ్ పేరిట పథకాన్ని చేపట్టారని, మొదటి విడత రూ.10వేల నుంచి రూ.15వేలు, రెండోవిడత రూ.20వేలునుంచి రూ.25వేలు, మూడో విడత రూ.50వేలవరకు రుణాన్ని పెంచడం జరుగుతుందన్నారు. పీఎం స్వనిధి పథకంలో కొత్తగా నమోదు చేసుకునేవారు దరఖాస్తులను మెప్మాద్వారా బ్యాంకుకు అందజేయాలన్నారు. బ్యాంకుమేనేజర్లు మోహన్, ఎస్.శ్రీనివాసరావు, ఎ.రవితేజ, సీవో దేవకీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఇన్‌చార్జి అమూల్యకు అభినందనలు
మామిడికుదురు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన గొల్లపల్లి అమూల్యను మామిడికుదురు మండలానికి చెందిన టీడీపీ నాయకులు మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. ఆమెను దుశ్శాలువాలతో సన్మానించారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, చుట్టుగుళ్ల కిశోర్, ఉండ్రు శ్రీరామారావు, వాసంశెట్టి వెంకటరావు, మెండా వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

యానాం సమస్యలపై గవర్నర్‌కు వినతి
యానాం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): యానాంలోని పలు సమస్యలపై ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యానానికి సం బంధించిన అంశాలపై వివరించారు. విద్యుత్‌శాఖలో హెల్పర్ పోస్టుల భర్తీలో రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వేషన్లు కల్పించాలని, యానాం గ్యాస్‌పైప్‌లైన్ లీకేజీ ఘటనపై, యానాం వ్యవసాయశాఖ సంబంధించిన అంశాలను, ఆదిద్రావిడ శాఖలో అభివృద్ధి పనులకు సంబంధించిన పనుల ప్రారంభంలో ఉన్న అడ్డంకులు, ప్రభుత్వాసుపత్రిలో అధికారుల పనితీరు తదితర అంశాలను గవర్నర్‌కు ఎమ్మెల్యే వివరించారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు
అంబాజీపేట, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):స్వస్థనారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం, వక్కలంక పంచాయతీల వద్ద సర్పంచ్‌లు శాంతుమారి, వాసంశెట్టి రేవతి ఆధ్వర్యంలో జరిగిన శిబిరాల్లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వైద్యాధికారులు కేఎస్ శ్రీనివాస్, కె.సుమప్రియ, నాయకులు బొంతు పెదబాబు, కొర్లపాటి గోపి పాల్గొన్నారు.

గోతులమయంగా మండపేట-దుళ్ల రోడ్డు

• కళ్లలోకి దుమ్ముతో అవస్థలు • ప్రతిరోజూ నరకం చూస్తున్న ప్రజలు, వాహనదారులు • పట్టించుకోని యంత్రాంగం


మండపేట-దుళ్ల మధ్య రోడ్డు దుస్థితి

మండపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) మండపేట నుంచి దుళ్ల వెళ్లే ఏడిద రోడ్డు గోతులుమయం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండపేట పరిసర ప్రాంతాల నుంచి రోజూ ఏడిద, దుళ్ల మీదుగా రాజమహేంద్రవరం, కడియం ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మండ పేట, ఏడిద గ్రామాల మధ్య రైస్ మిల్లులతోపాటు ఆయిల్, పేపరు మిల్లులు అధికంగా వున్నాయి. వాటికి నిత్యం వచ్చే లారీలు కూడా ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుం టాయి. దీంతో ఈ రోడ్డు గోతులమయంగా మారి బూడిద లేచి వాహనదారుల కళ్లల్లో పడు తోంది. దీంతో ఇటువైపు రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదా రులు తరచూ కంటి అసుపత్రులకు పరు గులు తీస్తున్నారు. ఒకపక్క పరిశ్రమల నుంచి వచ్చే దూళి, మరో పక్క రోడ్డుపై నుంచి వచ్చే బూడిద కారణంగా ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే వారంతా రోజూ నరకాన్ని చూస్తున్నారు. మండపేట, ఏడిద, దుళ్ల రోడ్డుకు మరమ్మతులు చేసి గోతులబారి నుంచి కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారు లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఆలమూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంపై ఆలమూరులో మంగళవారం కూటమి నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశా రు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పలువురు కూటమి నాయకులు ప్రధాని మోదీ నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నాగిరెడ్డి స్వామి, అయినవిల్లి సత్తిబాబు, సుంకర శ్రీరాములు, వంటిపల్లి పాపారావు, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, ఈదల రాంబాబు, కేతా రాంబాబు, గారపాటి శ్రీనివాస్, బైరిశెట్టి రాంబాబు, చల్లా ఏడుకొండలు, బొబ్బా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆలమూరులో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

వాడపల్లి ఆలయంలో భక్తజన సందడి


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పలు పూజలు చేశారు. వేకువజామునే ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం, గోప్రదక్షిణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తజనం అన్నప్రసాదంలో పాల్గొన్నారు.

విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఇంద్రకీలాద్రి పై ఉన్న కనకదుర్గ అమ్మవారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మంగళ వారం దర్శించుకున్నారు. గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పరిశుభ్రత పాటించకపోతే చర్యలు


మండపేటలో షాపులను తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మండపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండపేటలోని దుకాణదారులు తమ పరిసరాల్లో శుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవని మండపేట పురపాలక సంఘ కమిషనర్ టీవీ రంగారావు పేర్కొన్నారు. మంగళవారం పారిశుధ్య పర్యవేక్షణలో భాగంగా వార్డు పారిశుధ్య సెక్రటరీలు, పారిశుధ్య మేస్త్రీలు పట్టణ పరిధిలో తనిఖీలు నిర్వహించారు. కృష్ణాటాకీస్ పక్కన రోడ్డుపై చెత్త పడేసిన షాపు యజమానికి రూ.1000 జరిమానా విధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించినా లేదా ప్రోత్సహించినా జరిమానాలు విధిస్తామని పలు దుకాణదారులను ఆయన హెచ్చరించారు.

శాంతి, భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలి

కొత్తపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల్లో ఎక్కడా శాంతి, భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో అధికారులు, పోలీసులు, తదితర శాఖల అధికారులతో దసరా ఉత్సవాలపై సమీక్షించారు. వివాదాస్పద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా పోలీసులు నిఘా ఉంచాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాలని శ్రీకర్ సూచించారు. సమావేశంలో పలువురు తహసీల్దార్లు, రావులపాలెం రూరల్, గన్నవరం సీఐలు విద్యాసాగర్, భీమరాజు, ఎస్ఐలు సురేంద్ర, చంటి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీరామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

పుంత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

ద్రాక్షారామ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పుంత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రామచంద్రపురం మార్కెట్ కమిటీ సభ్యులు సమావేశంలో కోరారు. మంగళవారం కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు పుంత రోడ్ల నిర్మాణం, రైతులు ధాన్యం ఆరబెట్టుకున్న సమయంలో వానలు పడితే రక్షణ కోసం టార్పాలిన్‌లు ఇప్పించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని సభ్యులు వాసంశెట్టి బలరాం, జగ్గంపూడి జనిరాజు అధ్యక్షుడిని కోరారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు సర్పంచ్ కె.అరుణ, కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.వాసుదేవరావు, వ్యవసాయశాఖ ఏడిఏ బి.నాగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

ఆలమూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో వారు నిరసన తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వెంటూరు గ్రామంలో మంగళవారం పిల్లలకు, గ్రామస్తులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. కార్యక్రమం లో ఉప సర్పంచ్ నున్న ప్రదీప్, ఎంపీటీసీ విజయ్‌కుమార్, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఆలమూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో చదువుపైనే దృష్టిపెట్టాలని అప్పుడే భవిష్యత్ అద్భుతంగా ఉంటుందని రావులపాలెం రూరల్ సీఐ సిహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ సూచించారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో మంగళవారం డ్రగ్స్ వద్దు బ్రో, సైబర్ నేరాలు, స్త్రీలపై జరిగే నేరాలు, ట్రాఫిక్ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో వారు ప్రసంగించారు. సదస్సులో కాలేజీ ప్రిన్సిపాల్ నల్లమిల్లి సురేష్‌రెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

30లోగా పంట నమోదు పూర్తి చేసుకోవాలి

కె.గంగవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సాగు చేసిన రైతులు తమ పంటను ఈ నెల 30 లోగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ మండల అధికారి ఏ.సద్గురుమూర్తి అన్నారు. మంగళవారం సత్యవాడ, పాణింగపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాల్లో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

కిటకిటలాడుతున్న అమ్మవారి ఆలయాలు

• భవానీ భక్తులతో ప్రత్యేక సందడి • అమ్మవారికి భక్తుల కుంకుమ పూజలు, అభిషేకాలు


గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు

గాయత్రీదేవి అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

ద్రాక్షారామ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో రెండో రోజు మంగళవారం శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించారు. వైదిక కార్యక్రమాలతో పాటు, వేదపారాయణలు, సూర్య నమస్కారాలు, మహాలింగార్చనలు, అమ్మవారి అనుష్టానాలు, శ్రీచక్ర నవార్చన, సాయంత్రం సువర్ణ, రజిత, విశేష పుష్పార్చన, చతుర్వేద స్వస్తి నీరాజన మంత్రపుష్పాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి కవాట బంధనం చేశారు. మంగళవారం అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గాయత్రీదేవిగా దర్శనం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు ఆయా ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక కుం కుమ పూజలు జరిపారు. ఉచ్చిలి కాలువరేవులో ఉన్న విజయదుర్గమ్మ అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. వాడపల్లి, పేరవరం, రాజవరం, ర్యాలి తదితర గ్రామాల్లో భవానీదీక్షదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీదీక్షదారులతో ఆయా అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి.

భవానీ భక్తుల సందడి

మండపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా అమ్మవారి ఆలయాలు రెండోరోజు భవానీ భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం మండపేటతోపాటు మండలంలో వున్న ఆయా అమ్మవార్ల ఆలయాలు భవానీ భక్తుల నామస్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు, భక్తి గీతాలతో సందడి నెలకొంది. రెండో రోజు మంగళవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పలు పూజలు జరిపారు.

గాయత్రీగా విజయదుర్గమ్మ

రాయవరం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని రెండోరోజు మంగళవారం రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా అమ్మవారు వేదమాత గాయత్రీదేవిగా పూజలందుకుంది. తొలుత విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి గాడ్ కుమార్తె సత్య వెంకట కామేశ్వరి అమ్మవారికి పూజలు జరిపారు. భక్తులకు అమ్మవారి కుంకుమ, తీర్థం అందజేశారు. మహిళలు అమ్మవారికి గాయత్రి అష్టోత్తరాలతో సామూహిక శ్రీచక్ర అర్చనలు చేశారు. భక్తులనుద్దేశించి పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పీఠంలో ఆధ్యాత్మికవేత్త గొర్తి సుబ్రహ్మణ్య శాస్త్రి దుర్గాదేవి అవతారాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి, గాదే కృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా ప్రాంతాల్లో శరన్నవరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రెండోరోజు మంగళవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి గాయత్రీదేవిగా పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

చింతలూరు నూకాంబిక ఆలయంలో...

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో రెండోరోజు మంగళవారం ఘనంగా జరిగాయి. చింతలూరు నూకాంబిక ఆలయంలో అమ్మవారికి నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలమూరు, చింతలూరు, పెదపళ్ల, సంధిపూడి, పినపళ్ల, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి, చొప్పెల్ల, చెముడులంక, మడికి, మూలస్థానం, జొన్నాడ తదితర గ్రామాల్లో దేవీ నవరాత్రులను రెండో రోజును ఘనంగా నిర్వహించారు.

సామూహిక కుంకుమ పూజలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని మంగళవారం ఆయా అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. ఈతకోట కనకదుర్గమ్మ ఆలయంలో జరిగిన సామూహిక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రావులపాలెం కాలువగట్టు చెంతన ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఆయా గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, ప్రత్యేక మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు, భవానీ మాలధారులు అమ్మవారిని దర్శించుకున్నారు.


ఆలమూరు మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారు


గాయత్రి అవతారంలో రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా అమ్మవారు


ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో విజయదుర్గా దేవిని గాయత్రీదేవిగా అలంకరించిన దృశ్యం


మండపేటలో ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

నేడు మండపేటలో లోక్ కల్యాణ మేళా

మండపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే లోక్ కల్యాణమేళాకు సంబంధించి బుధవారం స్థానిక వివేకానంద మున్సిపల్ హైస్కూల్ వద్ద వీధి వ్యాపారులకు ప్రత్యేక సాధికారిక మేళా నిర్వహిస్తున్నామని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు.


జొన్నాడలో సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో డీఈఈ

సోలార్ విద్యుత్‌తో బహుళ ప్రయోజనాలు
ట్రాన్స్‌కో డీఈఈ శ్రీధర్

ఆలమూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ట్రాన్స్‌కో మండపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.శ్రీధర్ అన్నారు. జొన్నాడలో సోలార్ విద్యుత్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్, బైరిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ రమణ

సకాలంలో రుణాల చెల్లించి సొసైటీ వృద్ధికి సహకరించాలి

కె.గంగవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సొసైటీలో రుణాలు పొందిన రైతులు వాటిని సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని సొసైటీ అధ్యక్షుడు జగతా రమణ అన్నారు. మంగళవారం సొసైటీ ఆవరణలో సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు నెక్కంటి సాయి హనుమాన్, కడియాల ధనరాజు, సూపర్‌వైజర్ భాస్కరరావు, కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, చిర్రా సురేష్ తదితరులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న దృశ్యం

పట్టణ సుందరీకరణ పనుల పరిశీలన

మండపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ సుందరీకరణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ నేత మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ అన్నారు. మండపేట సుందరీకరణ పనుల్లో భాగంగా జరుగుతున్న స్వాగతద్వారం పనులతోపాటు పలు పనులను ఆయన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. పట్టణానికి ఇరువైపులా వున్న ఆర్చీలకు రంగులు వేయడం తోపాటు పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

మహిళల ఆరోగ్య రక్షణకే స్వస్థ నారీ సశక్త్ అభియాన్


కె.గంగవరం మండలం యండగండిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు

కె.గంగవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించిందని పామర్రు ఆసుపత్రి వైద్యుడు వర్ధన్ అన్నారు. మంగళ వారం యండగండి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. అనంతరం మహిళా సంరక్షణకు వైద్య సిబ్బ ంది, ప్రజా ప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. పామర్రు ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఎంపీ హెచ్ఈవో పీవీ ప్రకాష్ రావు, ఎంపీహెచ్ఎస్ కామేశ్వర రావు, స్వప్న, వాసంతి, సుమ, శైలజ తదితరులు పలు సేవలందించారు. గ్రామ సర్పంచ్ చోడే గోవిందరాజు, ఎంపీటీసీ కడలి సత్యసూర్య కుమారి, బీజేపీ నాయకులు అవసరాల రమణ మూర్తి, కొప్పిశెట్టి చంద్రరావు, నున్న సత్యనారాయణ, గుర్రాల సత్యనారాయణ, ఏ.నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో...

మండపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గడి సత్యవతి అన్నారు. మండపేటలోని 4వ వార్డు తర్వాణిపేటలో మంగళవారం స్వస్థనారీ కార్యక్రమంలో భాగంగా వైద్యురాలు రమ్యలక్ష్మీ గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుండు రామతులసి, పోలమూరి శ్రీనివాస్, కోడూరి నాగరాజు, గుర్రాల సత్తిబాబు తదితరులతో పాటు ఆరోగ్య సిబ్బంది ఆశావర్కర్లు, అంగన్వాడీలు, డ్వాక్రా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

● ద్వారపూడి ఆసుపత్రి వద్ద మంగళవారం స్వస్థనారీ సశక్త్ అభియాన్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు, అంగన్‌వాడి సిబ్బందితో పాటు కూటమి నాయకులు యరగతపు బాబ్జి, మండల వైస్ ఎంపీపీ గజ్జి రమణ, జెడ్.మేడపాడు సహకార సంఘ అధ్యక్షుడు సలాది బాలసుబ్రహ్మణ్యం, పల్ల బాబు, జనసేన నాయకుడు చింతా దొరబాబు, సత్తి సత్యనారాయణ, బీజేపీ నాయకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరుమిల్లి గ్రామ సర్పంచ్ ఆచంట సత్యనారాయణ తెలిపారు. మంగళవారం చినకోరుమిల్లిలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి మానస సుప్రియ పలు అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మండపేట మార్కెట్ కమిటీ డైరెక్టరు మోటుపల్లి బాపిరాజు, ఎలుగుబంటి వీరభద్రం, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, ఏఎన్ఎం దుర్గాదేవి, ఎంఎల్‌హెచ్‌పి ప్రశాంతి, హెల్త్ అసిస్టెంట్ రామారావు, 104 సిబ్బంది, వివిధ గ్రామాల ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


మాచరలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో విజయ్‌కుమార్

వృత్తివిద్య నైపుణ్యాలపై ఆసక్తి పెంచుకోవాలి

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వృత్తివిద్య నైపుణ్యాలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని ఎంఈవో-2 కండవిల్లి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మాచర ఉన్నత పాఠశాలలో వృత్తివిద్య కోర్సుల్లో భాగంగా పదో తరగతి, ఇంటర్ విద్యార్థినులకు నిర్వహిస్తున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల వృత్తివిద్య శిక్షకులు పి.లలిత పర్యవేక్షణలో 12 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

రావులపాలెం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తుగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావులపాలెం టౌన్ సీఐ ఎం.శేఖర్‌బాబు, కళాశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా విద్య నభ్యసించాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిని సత్కరించారు.

ప్రభుత్వ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి


పాడి రైతులకు సూచనలు ఇస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకట్రావు, ఏడిఏ రామకృష్ణ

కె.గంగవరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి కె.వెంకట్రావు, రామచంద్రపురం ఏడిఏ ఓ.రామకృష్ణ అన్నారు. మంగళవారం దంగేరు, కోట, సత్యవాడ గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాలు జరిగాయి. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పాడిరైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై వివరించారు. కార్యక్రమంలో పశువైద్యులు భావనాజ్యోతి, సంయుక్తలక్ష్మి, శ్రావణి ఆధ్వర్యంలో గంగవరం, కోటిపల్లి, పామర్రు ఆసుపత్రుల సిబ్బంది వైద్య సేవలు అందించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.